RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18
సంచిక : 162
Vol : 18
Issue : 162

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, ఆదివారం 23 ఆగస్టు 2026
Warangal, Sunday 23 August 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

# 'రియల్' రికార్డ్



- ఇండ్ల అమ్మకాల్లో హైదరాబాద్ టాప్
- ప్రధాన నగరాల్లో 6 శాతం తగ్గుదల...
- హైదరాబాద్‌లో మాత్రం ఏకంగా 15 శాతం వృద్ధి
- మూడు నెలల్లో 13,196 యూనిట్ల విక్రయాలు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు తగ్గినప్పటికీ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మాత్రం దూసుకెళ్తోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, కొనుగోలుదారుల్లో పెరుగుతున్న ఆచితూచి వ్యవహరించే ధోరణి కారణంగా ఎనిమిది ప్రధాన నగరాల్లో గృహాల విక్రయాలు 6 శాతం తగ్గగా.. హైదరాబాద్‌లో మాత్రం ఏకంగా 15 శాతం వృద్ధి నమోదైంది. 2026 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో హైదరాబాద్‌లో 13,196 నివాస యూనిట్లు విక్రయమైనట్లు ప్రోప్‌టైగర్ 'రియల్ ఇన్‌సైట్' నివేదిక వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో హైదరాబాద్‌లో 11,513 ఇళ్లు అమ్ముడయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ నాటికి ఆ సంఖ్య 13,196 యూనిట్లకు చేరింది. అంటే ఏడాది వ్యవధిలో 1,683 ఇళ్ల అదనపు విక్రయాలు నమోదయ్యాయి. శాతం పరంగా చూస్తే హైదరాబాద్ గృహ విక్రయాల్లో 15 శాతం వృద్ధిని సాధించింది. దేశంలోని ప్రధాన నగరాల్లో చాలా చోట్ల అమ్మకాలు తగ్గిన సమయంలో (మిగతా 2వ పేజీలో...)

# బియ్యం దందాకు కళ్లెం




- డీలర్లు, లబ్ధిదారులకు డేంజర్‌బెల్
- బియ్యం అమ్మితే కఠిన చర్యలు...
- పౌర సరఫరాల శాఖ అలర్ట్!?
- సన్నబియ్యం పథకం ఆశయం దారి మళ్లకుండా చర్యలు



పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారులకు, రేషన్ డీలర్ లకు పౌర సరఫరాల శాఖ తీవ్ర హెచ్చరిక జారీ చేస్తుంది. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చిన క్రమంలో చాలామంది నిరుపేదలు వాటిని తినకుండా బయట అమ్ముకున్నారు. ఈ క్రమంలోనే ప్రజలు తినటానికి పనికి వచ్చే విధంగా పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తోంది. అయినా ఆ పథకం ఆశయం దారి మళ్లుతోంది. రూపాయి లేకపోయినా పేదవాడు ఆకలితో అలమటించకూడదని ఉచితంగా బియ్యం ఇస్తుంటే, ఆ లబ్ధి అక్రమార్కుల పాలిట కాసుల పంటగా మారుతోంది. అర్హులైన పేదల కడుపు నింపాల్సిన బియ్యం బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతోంది. ప్రస్తుతం చాలా చోట్ల రేషన్ కార్డు ఉన్నవారు బియ్యాన్ని ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నారు. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే (మిగతా 2లో...)

# మారిన రూపురేఖలు






- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త సొబగులు
- మార్పులతో ఎయిర్ పోర్ట్ తరహాలో లుక్...
- ప్రయాణికులకు వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్
- 200 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు
- నాలుగైదు నెలల్లో అందుబాటులోకి వచ్చే ఛాన్స్

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును ఎయిర్‌పోర్ట్ తరహా ప్రపంచస్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత డిసెంబర్ నుంచి ప్రయాణికులకు ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం రోజుకు సుమారు 1.5 లక్షల మంది ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. రోజూ దాదాపు 180 రైళ్లు ఈ స్టేషన్‌కు వచ్చి వెళ్తున్నాయి. ఆధునీకరణ తర్వాత ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను రూపొందిస్తున్నారు.

స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా పార్కింగ్ సదుపాయాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు తమ వాహనాలను పార్క్ చేయడంతో పాటు ఛార్జింగ్ చేసుకునేలా పార్కింగ్ (మిగతా 2లో...)


# తెలంగాణ నుంచి ఒక్కరే

- జాతీయ ఉత్తమ అవార్డుకు దేశవ్యాప్తంగా 48 మంది ఎంపిక
- 26 మంది పురుషులు, 22 మంది మహిళలు...
- టీచర్స్ డే రోజున అవార్డులు అందించనున్న రాష్ట్రపతి



పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : దేశవ్యాప్తంగా పాఠశాల విద్య, అక్షరాస్యత కోసం విశేష కృషి చేసిన 48 మంది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో, విద్యార్థులను తీర్చిదిద్దడంలో చూపిన నిబద్ధత, అంకితభావాలకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. 27 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వీరిని ఎంపిక చేసినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెల్లడించింది. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వీరికి జాతీయ ఉపాధ్యాయ (మిగతా 2లో...)

# హైదరాబాద్‌లో విషాదం



- కుప్పకూలిన ఏడంతస్తుల భవనం..
- ఇద్దరు మృతి.. ముగ్గురికి సీరియస్..

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : హైదరాబాద్ లో ఘోర ప్రమాదం జరిగింది. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరికొంతమంది శిథిలాల కింద చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తోంది. ఇక శిథిలాలు మీద పడి మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు తక్షణమే సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే రెస్క్యూ టీమ్ సమీప ఆస్పత్రికి తరలించింది. నాలాను ఆనుకుని ఉన్న కేవలం 50 గజాల విస్తీర్ణంలోనే ఏడంతస్తుల భవనాన్ని నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. నిర్మాణంలో ఉన్న భవనం కుప్పకూలడంతో దానికి ఆనుకుని ఉన్న హాస్టల్ లోని వాళ్లు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో దాని పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్ మెంట్ పాక్షికంగా దెబ్బతింది. శిథిలాలు (మిగతా 2లో...)

# మెట్రోకు భూగర్భ బాట...

## అండర్‌గ్రౌండ్‌లో మెట్రో పరుగులు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ విషయంలో కీలక ప్రణాళికలు చేస్తోంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ రెండోదశ విస్తరణలో విమానాశ్రయాలు, రైల్వే మార్గాలు, జాతీయ రహదారులు వంటి క్లిష్ట ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముఖ్యంగా హకీంపేట, శంషాబాద్ విమానాశ్రయాల సమీపంలో భూగర్భ మెట్రో మార్గాలను ప్రతిపాదించారు. రన్‌వే కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ ప్రణాళికలు రూపొందించబడ్డాయి. జేబీఎస్–శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం సమీపంలో సుమారు 1.65 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ మెట్రో నిర్మించాలని నిర్ణయించారు. హెచ్‌ఎండీఏ ప్రతిపాదించిన హైవే టన్నెల్ వెంట ఈ మార్గాన్ని తీసుకెళ్లేలా ప్రణాళిక ఉంది. దీనివల్ల విమానాశ్రయ రన్‌వేకు సంబంధించిన పరిమితులను అధిగమించి భద్రతా ప్రమాణాలను పాటించే అవకాశం ఏర్పడుతుంది.

అలాగే నాగోల్–శంషాబాద్ కారిడార్‌లో విమానాశ్రయ పరిధిలో సుమారు 1.6 కిలోమీటర్ల భూగర్భ మెట్రోను ప్రతిపాదించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణలో కార్గో స్టేషన్, ఎయిర్‌పోర్ట్ స్టేషన్ తో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి పౌర (మిగతా 2లో...)

# 4 ఏళ్లలోపు పిల్లలకు ఈ మందులు వద్దు!

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : చిన్నారుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్లోర్‌ఫెనిరమైన్ మాలియేట్, ఫినైల్‌ఫైన్ హైడ్రోక్లోరైడ్ కలిగిన ఫిక్స్‌డ్–డోస్ కాంబినేషన్ ఔషధాలను ఆంక్షలు విధించింది. నాలుగేళ్లలోపు పిల్లలకు ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. ఈ కాంబినేషన్‌తో తయారయ్యే ఔషధాలపై ప్రత్యేక హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ కంపెనీలను ఆదేశించింది.

కేంద్ర ప్రభుత్వం శనివారం ఆగస్టు 22, 2026న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ఈ రెండు ఔషధ పదార్థాలు కలిగిన అన్ని సంబంధిత ఫార్ములేషన్లకు కొత్త నిబంధనలు వర్తించనున్నాయి. ఇకపై ఔషధాల లేబుల్స్, ప్యాకేజీ ఇన్సర్ట్స్, ప్రచార సామగ్రిపై నాలుగేళ్లలోపు పిల్లల వినియోగానికి ఈ కాంబినేషన్ తగదనే విషయాన్ని స్పష్టంగా పేర్కొనాల్సి ఉంటుంది. ఇప్పటికే 2025 ఏప్రిల్ 15న ఈ రెండు పదార్థాలు కలిగిన కొన్ని ఖీణజల విషయంలో ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకుంది. తాజాగా నిబంధనలను విస్తరించి.. క్లోర్‌ఫెనిరమైన్ మాలియేట్, ఫినైల్‌ఫైన్ హైడ్రోక్లోరైడ్ రెండింటినీ కలిగి ఉన్న అన్ని సంబంధిత కాంబినేషన్లకు ఈ హెచ్చరికను వర్తింపజేసింది.

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 23 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 162


# బియ్యం దందాకు కళ్లెం...

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారుల ఇళ్ల ముందు దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు కేవలం ఐదు-పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. కొన్ని చోట్ల దందా మరింత ముందుకెళ్లింది. బియ్యం సంచులను ఇళ్లకు తీసుకెళ్లకుండానే షాపు వద్ద వేలిముద్ర వేసి, అక్కడే వదిలేసి కిలోకు రూ.10 నుంచి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు.

ఇలా మిగిలిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు లేదా పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు సమాచారం. బహిరంగ మార్కెట్లో కేజీకి రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది.

ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేశారు. ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. లబ్ధిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తామని చెప్తున్నారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తామని చెప్తున్నారు.

ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగస్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్తున్నారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు స్పష్టం చేశారు. లబ్ధిదారులు, డీలర్లు ఈ హెచ్చరికను పాటించకుంటే చర్యలు తప్పవని తీవ్ర హెచ్చరిక చేస్తున్నారు.

# 'రియల్' రికార్డ్...!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ ఈ స్థాయిలో వృద్ధి సాధించడం నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో ఇళ్లకు డిమాండ్ కొనసాగడానికి పలు అంశాలు కారణంగా కనిపిస్తున్నాయి. నగరంలో ఐటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా, ఇతర కీలక రంగాల్లో కార్యకలాపాలు కొనసాగుతుండటంతో ఉద్యోగ అవకాశాలు, నగరానికి వలసలు వంటి అంశాలు గృహ డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నాయి. దీనికి తోడు నగరంలోని పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త రహదారులు, మెట్రో విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు, కమర్షియల్ హబ్‌ల అభివృద్ధి వంటి అంశాలు కూడా రియల్ ఎస్టేట్‌పై ఆసక్తిని పెంచుతున్నాయి.

**దేశంలోని 8 ప్రధాన నగరాల్లో అమ్మకాలు ఎలా ఉన్నాయి?**

నివేదిక ప్రకారం 2026 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఎనిమిది ప్రధాన నగరాల్లో మొత్తం 91,729 నివాస యూనిట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 97,674 యూనిట్లు విక్రయమయ్యాయి. దీంతో మొత్తం విక్రయాల్లో 6 శాతం తగ్గుదల నమోదైంది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో ఇళ్ల అమ్మకాలు 7 శాతం తగ్గి 25,939 యూనిట్ల నుంచి 24,112 యూనిట్లకు పడిపోయాయి. ఢిల్లీ-ఎన్సీఆర్‌లో 7 శాతం తగ్గి 10,051 నుంచి 9,352 యూనిట్లకు చేరాయి. బెంగళూరులో 9 శాతం తగ్గి 15,628 నుంచి 14,186 యూనిట్లకు పడిపోయాయి. పుణే రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పరిస్థితి మరింత భిన్నంగా ఉంది. అక్కడ ఇళ్ల అమ్మకాలు 21 శాతం తగ్గి 15,962 యూనిట్ల నుంచి 12,642 యూనిట్లకు పడిపోయాయి. అహ్మదాబాద్‌లో 20 శాతం తగ్గి 9,451 నుంచి 7,541 యూనిట్లకు చేరగా.. కోల్‌కతాలో 9 శాతం తగ్గి 3,847 నుంచి 3,517 యూనిట్లకు పడిపోయాయి.

హైదరాబాద్‌తో పాటు చెన్నై రియల్ ఎస్టేట్ మార్కెట్ కూడా మంచి పనితీరు కనబరిచింది. 2025 ఏప్రిల్-జూన్‌లో 5,283 ఇళ్లు విక్రయించగా.. 2026 ఇదే కాలంలో 7,183 యూనిట్లకు అమ్మకాలు పెరిగాయి. దీంతో చెన్నైలో ఏకంగా 36 శాతం వృద్ధి నమోదైంది. అంటే ఎనిమిది ప్రధాన నగరాల్లో హైదరాబాద్, చెన్నై మాత్రమే అమ్మకాల్లో సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. మిగిలిన ఆరు నగరాల్లో విక్రయాలు తగ్గడం గమనార్హం.

# మారిన రూపురేఖలు...

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లోనే ప్రత్యేక మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. బోయిగూడ వైపు బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే 120 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో 100 పాయింట్లు నాలుగు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాల కోసం, మరో 20 పాయింట్లు ద్విచక్ర వాహనాల కోసం కేటాయించారు. దీంతో రైల్వే స్టేషన్‌కు కార్లు, బైక్‌లపై వచ్చే ప్రయాణికులకు ఒకేచోట పార్కింగ్‌తో పాటు ఛార్జింగ్ సదుపాయం లభించనుంది.

మరోవైపు గణేశ్ టెంపుల్ వైపు మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 80 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. నాలుగు చక్రాల వాహనాల కోసం 60, ద్విచక్ర వాహనాల కోసం 20 ఛార్జింగ్ పాయింట్లు కేటాయించారు. బోయిగూడ, గణేశ్ టెంపుల్ పార్కింగ్ ప్రాంతాలను కలిపితే సికింద్రాబాద్ స్టేషన్ పరిసరాల్లోనే మొత్తం 200 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి. రైల్వే స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా ప్రయాణికుల సౌకర్యాలతో పాటు పర్యావరణహిత రవాణాకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఈ ప్రాజెక్టులోని ముఖ్యాంశంగా మారింది. భవిష్యత్‌లో పెరిగే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఛార్జింగ్ మౌలిక వసతులను ఏర్పాటు చేయడం ద్వారా స్టేషన్ ప్రాంతాన్ని ఈవీ ఫ్రెండ్లీ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో తీవ్ర విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

మీదపడి అపార్ట్ మెంట్ గోడలు ధ్వంసం అయ్యాయి. ఫ్లాట్లలోని సామాగ్రి ధ్వంసం అయింది. భవనం కుప్పకూలడంతో అపార్ట్ మెంట్ వాసులు సైతం భయంతో పరుగులు తీశారు. తమ సామాగ్రి ధ్వంసం కావడంపై వాళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు నిర్మాణంలో ఉన్న భవనం శిథిలాల కింది మరో ముగ్గురు కార్మికులు చిక్కుకుని ఉండొచ్చని డీఆర్ఎఫ్ సిబ్బంది అంచనా వేస్తోంది. దాంతో శిథిలాలు తొలగించి ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇక యజమాని అత్యాశతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం 50 గజాల స్థలంలో ఏడు అంతస్తుల భవనం నిర్మాణం ఏంటని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# మెట్రోకు భూగర్భ బాట...

(మొదటి పేజీ తరువాయి)

విమానయాన మంత్రిత్వశాఖ అనుమతి అవసరం.

బేగంపేట విమానాశ్రయం రన్‌వే కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎత్తు పరిమితులు అమలులో ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని శామీర్‌పేట, మేడ్చల్ కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా డిజైన్ చేశారు. రైల్వే క్రాసింగ్‌లు కూడా కీలక సవాలుగా మారనున్నాయి. ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ ప్రాంతాల్లో మెట్రో మార్గం రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది.

దీనికోసం దక్షిణ మధ్య రైల్వే నుంచి సూత్రప్రాయ అనుమతి లభించినట్లు అధికారులు తెలిపారు. సుచిత్ర ప్రాంతంలో మాత్రం అనుమతి ఇంకా పెండింగ్‌లో ఉంది. జాతీయ రహదారుల వెంట కూడా రైట్ ఆఫ్ వే అనుమతులు కీలకం. మదీనాగూడ-పటాన్‌చెరు, చింతలకుంట-హయత్‌నగర్ మార్గాల్లో ఎన్‌హెచ్-65, ఆరాంఘర్-శంషాబాద్, బోయిన్‌పల్లి-మేడ్చల్ మార్గాల్లో ఎన్‌హెచ్-44 పరిధిలో మెట్రో స్తంభాల నిర్మాణానికి కేంద్ర అనుమతులు అవసరం.

రెండో దశలో ఏడు కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో మార్గం మొత్తంగా రెండో దశలో ఏడు కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో మార్గం, 86 స్టేషన్లు ప్రతిపాదించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.38,595 కోట్లు. పూర్తయిన తర్వాత రోజుకు సుమారు 12.42 లక్షల మంది ప్రయాణికులు ఉపయోగించే అవకాశం ఉంది. నిధుల్లో కేంద్రం వాటా రూ.6,666 కోట్లు, రాష్ట్రం వాటా రూ.11,933 కోట్లు, రుణాల ద్వారా రూ.19,996 కోట్లు సమీకరించనున్నారు.

మెట్రో రైలు ప్రాజెక్ట్ రవాణా వ్యవస్థలో కీలకం జీహెచ్ఎంసీ పరిధిలో 36.5 కి.మీ., మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో 24.9 కి.మీ.,



సైబరాబాద్‌లో 41.3 కి.మీ. మేర విస్తరణ జరుగుతుంది. అనుమతుల ప్రక్రియ పూర్తయితే హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ రవాణా వ్యవస్థలో కీలకంగా ఉండనుంది. భూగర్భ మెట్రో రైల్ మార్గాలు ఈ ప్రాంతాల్లో సక్సెస్ అయితే భవిష్యత్ లో మరిన్ని ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉంటుంది.

## 4 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాషబోయిన శ్రీధర్ యాదవ్



పీపుల్స్‌డైరీ-హనుమకొండ : వరంగల్ వెస్ట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ 26 నూతన డివిజన్ ల ప్రెసిడెంట్ల నియామక ప్రతిపాదనలకు టీపీసీసీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలలో వరంగల్ పశ్చిమ లోని 4 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాషబోయిన శ్రీధర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్బంగా శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ నాపై నమ్మకం తో అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ బలోపేతం కొరకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నా నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,డీసీసీ జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్బంగా శ్రీధర్ యాదవ్ కు నాయకులు, కార్యకర్తలు, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా కె.పూజ బాధ్యతల స్వీకరణ



పీపుల్స్‌డైరీ-వరంగల్ : పదోన్నతి ప్రాతిపదికన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కె.పూజ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి పూజకు న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి ఎ.ప్రదీప్, సూపరింటెండెంట్ మోహన్ రావు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం, న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, లోక్‌అదాలత్‌లు, న్యాయ అవగాహన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడం తన ప్రాధాన్యతలుగా పేర్కొన్నారు. అలాగే, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న వివిధ న్యాయ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేసేందుకు అధికారులు, సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# తెలంగాణ నుంచి ఒక్కరే...

(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవం రోజు సెప్టెంబర్ 5న అవార్డులను అందజేస్తారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయినవారిలో 26 మంది పురుషులు, 22 మంది మహిళలు ఉన్నారు. వీరిని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల నుంచి కేంద్రీయ, నవోదయ విద్యాలయాల వరకు, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అన్ని స్కూళ్ల నుంచి ఎంపిక చేశారు. విద్యా మంత్రిత్వ శాఖ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరింది. దీనికి జూన్ 15 నుంచి జూలై 20 వరకు గడువు విధించింది. ఈ దరఖాస్తులను మొదట జిల్లా స్థాయిలో, తర్వాత రాష్ట్ర స్థాయిలో, చివరగా జాతీయ స్థాయిలో పరిశీలించి వీరిని ఎంపిక చేశారు.

తెలంగాణ నుంచి ఒక మహిళా టీచర్ ఎంపిక

రాష్ట్రంలోని కామారెడ్డి జల్లాలోని ఉపాధ్యాయురాలు భవాని బొంపెల్లి ఎంపికయ్యారు. ఆమె గాంధారి మండలకేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. గణితం పాఠాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభంగా బోధిస్తున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తెలంగాణ నుంచి ఆమె ఒక్కరే ఎంపికయ్యారు. ఆమె గతేడాది తెలంగాణ రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు.

# కేటీపీపీ ముందు ఆర్టీసీ బస్సులను ఆపాలి

## ఏఐటియుసి,హెచ్-64 రీజినల్ కమిటీ వినతి


**గణపురం, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రధాన గేటు పరకాల భూపాలపల్లి ప్రధాన రహదారిపై ప్రభుత్వ ఆర్టీసీ బస్సులను నిలపాలని భూపాలపల్లి డిపో మేనేజర్ కు శనివారం ఏఐటీయూసీ హెచ్ 64 కేటిపిపి రీజనల్ కమిటీ అధ్యక్షులు కోలా శ్యామ్, ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కేటీపీపీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఉద్యోగులు విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. భూపాలపల్లి వెళ్తున్న కార్మికులు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించవలసి వస్తుందని తద్వారా అదనపు ప్రయాణ ఖర్చు అవుతుందని, రాత్రి షిఫ్ట్ ముగించుకొని వెళ్తున్న కార్మికుల భద్రతను పరిగణంలోకి తీసుకొని బస్సులను కేటీపీపీ ముందు ఆపేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిపో మేనేజర్ కు వివరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి కేటీపీపీ ముందు బస్సులను ఆగేలా ఆదేశాలు ఇస్తానని, ఎవరైనా బస్సులను ఆపకపోతే తనకు ఫిర్యాదు చేయాలని తెలిపినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేటీపీపీ రీజినల్ కార్యదర్శి గోపిరెడ్డి కిరణ్, రీజినల్ నాయకులు పెరుక రాజేష్, బండారి నగేష్, శ్రీరాముల వెంకటమ్మ, హామీజా, విజయ తదితరులు పాల్గొన్నారు.



## రీ-సర్వే డేటా ఎంట్రీలో తప్పులకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్


**ఖమ్మం, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** రీ--సర్వే డేటా ఎంట్రీలో తప్పులకు తావు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కూసుమంచి మండలం భగత్‌వీడు గ్రామంలో కొనసాగుతున్న రీ--సర్వే, డేటా ఎంట్రీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సర్వే బృందాలు నమోదు చేస్తున్న వివరాలను క్షేత్రస్థాయి సర్వే వివరాలతో పరిశీలించారు. ఈ సందర్భంగా భగత్‌వీడు గ్రామానికి చెందిన ఎ.వీరభద్రం, కె.శ్రీనివాస రెడ్డి, పసుపులేటి నాగేశ్వరరావు, తదితరుల భూముల సర్వే వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... రీ--సర్వేలో భాగంగా చేపడుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియలో సర్వే బృందాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భూ విస్తీర్ణం, హద్దులు, ఇతర వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. శాటిలైట్ సాంకేతికతను ఉపయోగించి సర్వే నిర్వహిస్తున్నందున క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఉన్న భూ విస్తీర్ణం మేరకే వివరాలు నమోదవుతాయని కలెక్టర్ తెలిపారు.



రీ--సర్వే ద్వారా నమోదు చేసే భూ వివరాలు భవిష్యత్‌లో అనేక సంవత్సరాల పాటు ఉపయోగపడతాయని, అందువల్ల డేటా ఎంట్రీ సమయంలో ప్రతి వివరాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రీ--సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలతో పాటు కో-ఆర్డినేట్లతో కూడిన మ్యాప్‌ను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి భూమికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా సర్వే బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలు, డేటా ఎంట్రీలో నమోదు చేసిన వివరాలకు పూర్తి అనుసంధానం ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఆర్ఐ జ్యోతి, సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామారావు పటేల్ సేవలు మరువలేనివి

**పీపుల్స్‌డైరీ-కేసముద్రం :** బలవంతుల రామారావు పటేల్ సేవలు మరువలేనివని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో శనివారం రామారావు సతీమణి బలవంతుల సుశీల ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని శంకర్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడారు. పేదలకు వందల ఎకరాలు భూములు పంచిన మహనీయుడు రామారావు అని కొనియాడారు. ఆయన సతీమణి సుశీల మృతిపట్ల సంతాపం తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల రవిచందర్‌రెడ్డి మాట్లాడుతూ రామారావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఆయన మనవడు బలవంతుల సాయిరాజ్‌తో మాట్లాడి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుకూరి ఉపేందర్, మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, గొర్రె వెంకన్న, నరేటి సత్తయ్య, గాండ్ల యాదగిరి, బత్తుల పెద్ద వెంకన్న, చిన్న వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 23 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 162


# పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**భూపాలపల్లి ఆగస్టు పీపుల్స్ డైరీ..** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న ఈ పాఠశాల సముదాయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. శనివారం ఘన్ పూర్ మండలం మైలారం గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పాఠశాల నిర్మాణ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. నాలుగు అకాడమిక్ బ్లాకులు, సీనియర్, జూనియర్ డార్మిటరీలు, కిచెన్, డైనింగ్ హాళ్లు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌ల నిర్మాణ ప్రణాళికను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ఫుటింగ్ లెవెల్, బేస్ కాంక్రీట్ పనులు పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడవద్దని కలెక్టర్ ఆదేశించారు. కాంక్రీట్ గోడల నిర్మాణంలో షియర్ వాల్ టెక్నాలజీని వినియోగించి పనులను నాణ్యంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలో చెట్లను తొలగించవద్దని, ఒకవేళ తొలగించాల్సి వస్తే తప్పనిసరిగా అటవీ శాఖ అనుమతులు పొందిన తర్వాతే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో 2,640 మంది విద్యార్థులు, 300 మంది సిబ్బందికి వసతి కల్పించాల్సి ఉందని, అందుకు అవసరమైన నీటి వసతి కల్పించేలా 6 లక్షల లీటర్ల సామర్థ్యం గల అండర్‌గ్రౌండ్ ట్యాంక్, 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణంతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడిసి ఈఈ అరుణ్ కుమార్, తహసీల్దార్ రాజేశ్వర రావు, ఏఈ జీవన్, సర్పంచ్ సమ్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు-డోర్నకల్ మధ్య మూడు పూటలా రైలు నడపాలి

- **రైల్వే అధికారులు, కేంద్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థలు వెంటనే స్పందించాలి**
- **రిలే నిరాహార దీక్షకు సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అశోక్ అన్న వర్గం సంపూర్ణ మద్దతు**



**సింగరేణి,(కారేపల్లి) ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ):** ఇల్లందు నుంచి డోర్నకల్ మధ్య రోజుకు మూడు పూటలా ప్యాసింజర్ రైళ్లను నడిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అశోక్ అన్న వర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు రిలే నిరాహార దీక్ష చేస్తున్న కంచర్ల శ్రీనివాసరావు దీక్షా శిబిరాన్ని సందర్శించి పార్టీ జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా భూక్య శివ నాయక్ మాట్లాడుతూ 130 సంవత్సరాల చరిత్ర కలిగిన ఇల్లందు బొగ్గు గనులకు పుట్టినిల్లుగా ఉన్న ఇల్లందు ప్రాంతం రానురాను అభివృద్ధి పరంగా వెనుకబడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇల్లందు ప్రజలు తమ నిత్య అవసరాల కోసం మణుగూరు, ఖమ్మం, కారేపల్లి, కొత్తగూడెం తదితర దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, సింగరేణి సంస్థకు ఇల్లందు ప్రాంతం నుంచి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరు తున్నప్పటికీ, ప్రజలకు కనీస రవాణా సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం జరుగుతోందని విమర్శించారు. రైల్వే అధికారులు, కేంద్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థలు వెంటనే స్పందించి ఇల్లందు--డోర్నకల్ మధ్య రోజుకు మూడు పూటలా ప్యాసింజర్ రైలు సౌకర్యాన్ని పునరుద్ధరి ంచాలని డిమాండ్ చేశారు. రైలు సౌకర్యం అందుబా టులోకి వస్తే వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఇల్లందు ప్రాంత అభివృద్ధికి రైలు రవాణా ఎంతో కీలకమని, ప్రజల సౌకర్యార్థం ప్యాసింజర్ రైళ్లను వెంటనే పునఃప్రారంభి ంచాలని కోరారు. ఇల్లందు ప్రజల న్యాయమైన డిమాండ్ కోసం రిలే నిరాహార దీక్ష చేస్తున్న కంచర్ల శ్రీనివాసరావుకు సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అశోక్ అన్న వర్గం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని భూక్య శివ నాయక్ తెలిపారు. ప్రజా రవాణా సమస్య పరిష్కారం కోసం జరిగే ఉద్యమానికి ప్రజలు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

# గొల్లగూడెంలో తీరిన రహదారి కష్టాలు

## రూ.10 లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు పనులు

- **మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు**
- **సర్పంచ్ బత్తుల మౌనిక-సంపత్ కుమార్**



**సైదాపూర్ ఆగస్టు 22 ( పీపుల్స్ డైరీ ):** సైదాపూర్ మండలంలోని గొల్లగూడెం గ్రామస్థుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరింది. బతుకమ్మ ఘాట్ నుంచి వైకుంతధామం (స్మశాన వాటిక) వరకు వెళ్లే మార్గంలో రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న రెండు సీసీ రోడ్ల పనులను సర్పంచ్ బత్తుల మౌనిక-సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండాల్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి బతుకమ్మ ఆటస్థలం మీదుగా వైకుంతధామం వరకు నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ మార్గం పూర్తయితే బతుకమ్మ పండుగ వేళ మహిళలకు రవాణా ఇబ్బందులు తొలగడంతో పాటు, పొలాలకు వెళ్లే రైతులకు, కార్మికులకు, మత్స్యకారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రధాన సమస్యను గుర్తించి నిధులు మంజూరు చేయించిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామస్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ మజీద్ హుస్సేన్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, ఉప సర్పంచ్ దుస్స కుమార్, మాజీ సర్పంచ్‌ఎంపీటీసీ బత్తుల కొమురయ్య, మండల కొమురయ్యా, చల్లూరి సదానందం, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు రుద్రారపు లలిత రవి, బత్తుల అనిత, అందె రజిత, హసీనా, కొరిమి మహేష్, మిట్టపల్లి వెంకటయ్య, మిట్టపల్లి అపర్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చటి రోడ్లు.. అదుర్స్..కిలోమీటరు మేర పచ్చదనం..

## స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తున్న ప్రజలు



**రేగొండ అగస్ట్ 22 పీపుల్స్ డైరీ :** రేగొండ భూపాలపల్లి మార్గ మధ్యలో పరకాల రేగొండ రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు కనువిందు చేస్తున్నాయి. సుందర ప్రకృతి దృశ్యంతో మది పులకించిపోతున్నది. మనం ప్రయాణించే రహదారిలో ఓ చెట్టు నీడ రాగానే పచ్చదనం తగిలి హాయిగా అనిపిస్తుంటుంది. అనేక చెట్లు రహదారికి ఇరువైపులా పచ్చని పందిరేసి చల్లటి నీడనిస్తే ఇంకేముంది అప్పటి వరకు పడిన ప్రయాణ బడలిక కాస్త ఇట్టే ఎగిరిపోతుంది. రోడ్డు ఎక్కితే చాలు ఒకటే దుమ్ము, దూళి, ఎందుకొచ్చాం రా బాబు రోడ్డుపైకి అనుకునేలోనే మనం ప్రయాణించే రహదారిలో ఓ చెట్టు నీడ రాగానే పచ్చదనం తగిలి హాయిగా అనిపిస్తుంటుంది. పరకాల నుండి భూపాలపల్లి వెళ్లే మార్గంలో రేగొండ రూపిరెడ్డి పల్లి గంగారావి చెరువు వద్ద అర కిలోమీటర్ మేర రోడ్డుకు ఇరువైపులా పచ్చని పందిరిలా అల్లుకున్న చెట్లు కొమ్మలు, రహదారికి ఇరువైపులా ఎత్తైన చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఏపుగా పెరిగిన కొమ్మలతో రహదారి మెంత్తం పచ్చని పందిరి వేసినట్లు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. మంచి నీడనిస్తున్నాయి. శిశిర ఋతువు ఆ చెట్లకు మరింత శోభను ఇచ్చాయి. వాహన చోదకులు అక్కడికి రాగానే ఓ మధురాను భూతి ని పొందేలా చేస్తున్నాయి. ఇక్కడి రహదారిని పందిరిలా అల్లుకున్న చెట్లు ప్రతి ఒక్కరికి గుర్తు చేస్తుంటాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. రోడ్ల వెంబడి ఇలా మొక్కలు పెరిగితే మన ఊరు మంచి పర్యాటక ప్రాంతంగా భాసిల్లుతుందని ఇలాంటి దృశ్యాలు ప్రతి రోడ్డుకు ఇరువైపులా కనిపించాలని ఆశిద్దాం.

# ప్రమాద బాధితుడికి సకాలంలో ప్రథమ చికిత్స.. ఆసుపత్రికి తరలింపు




**మేడ్చల్ ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ):-** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడికి 108 సిబ్బంది సకాలంలో స్పందించి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడేలా చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది చూపిన వేగం, సేవా తత్పరతకు ఇది నిదర్శనంగా నిలిచింది. తూర్కపల్లి సమీపంలో ఓ యువకుడు ప్రయాణిస్తున్న కారు ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పి ప్రైవేట్ బస్సును ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే చుట్టుపక్కల వారు స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే 108 ఈఎంటి యాదమ్మ, పైలట్ ప్రభాకర్ ఎలాంటి ఆలస్యం చేయకుండా ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన యువకుడి పరిస్థితిని పరిశీలించి, ఈఆర్సిపి డాక్టర్ మనీష్ సూచనల మేరకు అక్కడికక్కడే అవసరమైన ప్రథమ చికిత్స అందించారు. అనంతరం బాధితుడిని సురక్షితంగా సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సకాలంలో 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకోవడం, వెంటనే వైద్య సహాయం అందించడం వల్ల బాధితుడికి మెరుగైన వైద్యం అందే అవకాశం కలిగింది.

### ప్రమాద సమయంలో 108 సేవలు.. ఒక నమ్మకం

రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకం. ప్రమాదాన్ని గమనించిన ప్రజలు వెంటనే 108కు సమాచారం అందించడం, అంబులెన్స్ సిబ్బంది సూచనలను పాటించడం ద్వారా బాధితులకు సకాలంలో వైద్యం అందే అవకాశం ఉంటుంది. ఈ ఘటనలోనూ స్థానికుల అప్రమత్తతకు తోడు 108 సిబ్బంది వేగంగా స్పందించడం కీలకంగా మారింది. బాధితుడికి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించిన ఈఎంటి యాదమ్మ, పైలట్ ప్రభాకర్ సేవలను బాధితుడి కుటుంబ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో విధి నిర్వహణలో చూపిన వారి చొరవ స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

# అంబారాన్నంటిన అభిమానుల సేవా కార్యక్రమాలు



**కమలాపూర్ ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ):** కమలాపూర్ మండల పరిధిలో పద్మ విభూషణ్ మెగాస్టార్ శ్రీ కొణిదెల చిరంజీవి 71వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కమలాపూర్ అంజనిపుత్ర ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాపూర్ ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రిలోని పేషెంట్లకు పండ్లు పంపిణీ చేసి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమలాపూర్ బస్టాండ్ ప్రాంగణంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షుడు గట్టు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడంతో పాటు, ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్ల శ్రీనివాస్, కటుకూరి దేవేందర్ రెడ్డి, వెనిశెట్టి శివకుమార్, నూక రమేష్, కాటం తిరుపతి, బాగాది రాజేందర్, వెంగళ రాము, మొగిలిచర్ల రాంబాబు, కాల్వ కుమార్ తదితర మెగాస్టార్ చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

# భక్తుల తాగునీటి సౌకర్యం కోసం హ్యాండ్‌బోర్ ఏర్పాటు

## ఎంపీ రఘురామ్ రెడ్డి నిధులతో ప్రారంభించిన జర్పల ధోని నాయక్



**సింగరేణి,(కారేపల్లి) ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** ఎంపీ రఘురామ్ రెడ్డి నిధులతో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హ్యాండ్‌బోర్‌ను పీఎస్ఆర్ మండల యూత్ ప్రెసిడెంట్ జర్పల ధోని నాయక్ శనివారం ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని హ్యాండ్‌బోర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జర్పల ధోని నాయక్ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా హ్యాండ్‌బోర్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలంపల్లి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దళితబందు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోలుగూరి నరేష్ నియామకం

## నియామక పత్రం అందించిన రాష్ట్ర దళితబంధు సాధన సమితి అధ్యక్షులు కొగిలా మహేష్



**జమ్మికుంట అగస్ట్ 22పీపుల్స్ డైరీ :** ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధు సాధన సమితి కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవలంబిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను ఊరూరా ప్రచారం చేస్తామని దళిత సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు తెలిపారు ఈ సందర్భంగా కోలుగూరి నరేష్ మాట్లాడు హుజురాబాద్ నియోజకవర్గంలో దళితబందు రెండవ విడత నిధులు మంజూరు చేయాలనీ గత 2 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం చాలా ఆనందంగా ఉందని రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయిలో పోరాటం చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు మరియు నా నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కొగిలా మహేష్ అన్న గారికి ధన్యవాదలు తెలియజేసారు.

# కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదిక

## ఈ. ప్రమిద అదనపు జూనియర్ సివిల్ జడ్జి, హుస్నాబాద్ కోర్టు



**హుస్నాబాద్ టౌన్ : (పీపుల్స్ డైరీ) ఆగస్టు 22** వచ్చేనెల సెప్టెంబర్ 12న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ. ప్రమిద సూచించారు. సోమవారం హుస్నాబాద్ కోర్టు హాల్లో లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో హుస్నాబాద్, బెజ్జంకి ఎస్ఐలు పి. లక్ష్మారెడ్డి, తిరుపతి, కోహెడ ఏఎస్ఐ మొగిలి నాయక్, న్యాయవాదులు బాకం సంపత్ కుమార్, కన్నోజు రామకృష్ణ, చిత్తారి హనుమయ్య, జుమ్లాల్ నాయక్, జే. కిరణ్ కుమార్, సుంకే రాజశేఖర్, దీకొండ ప్రవీణ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 23 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 162


## రాగాపురం లో పశువైద్య శిబిరం..



**ఆళ్ళపల్లి ఆగస్టు 22(పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని రాగాపురం గ్రామంలో పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ మరియు సర్పంచ్ ఆధ్వర్యంలో..సంతానోత్పత్తి సమస్యల పరీక్షలు మరియు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకా శిబిరం ఆళ్ళపల్లి: మండలంలో గల రాగాపురం గ్రామ పంచాయతీ లో పశుపోషకుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక సర్పంచ్ పాయం రామ నర్సయ్య ఆధ్వర్యంలో పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించరు. ఈ సందర్భంగా పశువుల సంతానోత్పత్తి సమస్యల పరీక్షలు మరియు చికిత్స గర్భ నిర్ధారణ పరీక్షలు ఎదకు రాని / పదేపదే ఎదకు వచ్చే పశువులకు వైద్య సేవలు కృత్రిమ గర్భధారణ మరియు ప్రజనన సంబంధిత సేవలు ఆవులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు పశువుల ఆరోగ్యంపై అవసరమైన వైద్య సలహాలు మరియు సూచనలు,వెటర్నరీ వైద్యులు మరియు పశువైద్య సిబ్బంది పాల్గొని పశువులకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు మరియు టీకాలను అందజేశారు. ఈకార్యక్రమంలో పశువైద్య డాక్టర్,మరియు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు..

## భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులు

### సీఐటీయూ ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ



**మేడ్చల్ ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ):-** సీఐటీయూ అనుబంధ బీసీడబ్ల్యూ యూనియన్ ఆధ్వర్యంలో అడ్డాలపై పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు లేబర్ కార్డు తీసుకోవాలని సీఐటీయూ మేడ్చల్ మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ.. లేబర్ కార్డు కలిగి ఉండటం వల్ల భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల వరకు, సహజ మరణానికి రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం, కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.30 వేలు, ప్రసవ సమయంలో రూ.30 వేలు, అంగవైకల్యానికి రూ.50 వేల వరకు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. అందువల్ల భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు లేబర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం 9951408268, 7569266582, 7993929594 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీడబ్ల్యూ యూనియన్ జిల్లా నాయకులు అశోక్, మండల నాయకులు ఎన్. కృష్ణ, జి. శ్రీను, స్వామి, చి. కృష్ణ, ఎల్లం, ఎల్లయ్య, అస్తరమ్మ, రజిని, సుతారి గూడా శ్రీను, అనిత తదితరులు పాల్గొన్నారు.


## సన్న రకాల వరి సాగు చేసే రైతులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి పద్మ



**భీమదేవరపల్లి, ఆగస్టు 22: (పీపుల్స్ డైరీ ):** ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకాల వరిని సాగు చేస్తున్న రైతులు తమ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మ ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం సన్న రకాలకు క్వింటాకు రూ.500 బోనస్‌తో పాటు మద్దతు ధర అందిస్తున్నందున ఈ నమోదు ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. సన్న రకాల విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు,సంబంధిత విత్తన డీలర్ వద్దే తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. సొంత విత్తనాలతో సాగు చేసిన రైతులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి, సంబంధిత ఏఈఓ వద్ద వివరాలు నమోదు చేసుకోవాలి. అనుమతించిన సన్న రకాలు: బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, జైశ్రీరామ్, డబ్ల్యూజీఎల్ 44. సెప్టెంబర్ 10, 2026 ధాన్యం విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులందరూ గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ అధికారి పద్మ కోరారు.

## ఘనంగా డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జన్మదిన వేడుకలు



**మేడ్చల్ ఆగస్టు 22,(పీపుల్స్ డైరీ):-** కాంగ్రెస్ పార్టీ 297వ డివిజన్ నాయకుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండు శ్రీకాంత్ జన్మదిన వేడుకలు మేడ్చల్‌లో ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ ఆటో స్టాండ్ ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో ఆటో యూనియన్ సభ్యులు శ్రీకాంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుల తరఫున దండు శ్రీకాంత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆటో కార్మికుల సమస్యలపై స్పందిస్తూ, వారి సంక్షేమానికి అండగా నిలిచే నాయకత్వాన్ని కొనసాగించాలని సభ్యులు ఆకాంక్షించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ దండు శ్రీకాంత్ మరింత చురుగ్గా ముందుకు సాగాలని వారు కోరుకున్నారు. జన్మదిన వేడుకలు కేవలం శుభాకాంక్షల కార్యక్రమంగా కాకుండా నాయకుడికి, ఆటో కార్మికులకు మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి నిదర్శనంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎర్ర విజయరావు, దండు ఓం రాజ్, నరేష్ తదితరులు పాల్గొని దండు శ్రీకాంత్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో మమేకమై కార్మికుల సంక్షేమానికి అండగా నిలవాలి అంటూ ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

## భీమదేవరపల్లి తహశీల్దార్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం

- సమయ పాలన పాటించని అధికారులు
- రైతుల తీవ్ర అవస్థలు:
- ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ

**భీమదేవరపల్లి ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ ) :** భీమదేవరపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో అధికారుల వేళాపాల లేని వైఖరి, తీవ్ర నిర్లక్ష్యం వల్ల భూ సమస్యలతో వచ్చే రైతులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్, డిటి,సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది సమయపాలన పాటించడం లేదని విమర్శించారు. ఉదయం 10:00 గంటలకు కార్యాలయానికి రావాల్సి ఉండగా, ఉదయం 11:30 గంటలైనా అధికారులు రాకపోవడంతో దూర ప్రాంతాల నుండి వచ్చే రైతులు గంటల తరబడి వేచి చూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు.



### వారసత్వ (విరాసత్) ఫైలుపై తీవ్ర నిర్లక్ష్యం:

వంగర గ్రామానికి చెందిన ఒక దళిత రైతు తండ్రి మరణించగా, ఆయనకు వారసత్వంగా రావలసిన భూమి విరాసత్ ఫైలును గత రెండేళ్లుగా అధికారులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని వెంకటస్వామి తెలిపారు. ఈ ఫైలును ఆర్డీఓ ఆఫీస్‌కు పంపగా రెండుసార్లు తిరస్కరణకు గురైందని, మూడోసారి పంపాల్సిన అధికారులు కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రక్రియలో ఇప్పటికే మూడుసార్లు స్లాట్ బుక్ చేసుకోవడం వల్ల సదరు పేద రైతుకు దాదాపు ₹20,000 వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రింది స్థాయి సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు లేక “మా ఫైలును ముందుకు పంపించండి” అని తహశీల్దార్ ని పలుమార్లు బతిమిలాడినా ఎలాంటి స్పందన లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భీమదేవరపల్లి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని, దళిత రైతులకు సంబంధించిన భూ సమస్యలను, నిలిచిపోయిన విరాసత్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని మాట్ల వెంకటస్వామి మాదిగ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

## మంత్రి పొన్నం..గాలి మాటలతో ప్రజలను మభ్య పెట్టొద్దు

- గౌరవెల్లి నీటిపై స్పష్టత ఇవ్వాలి
- గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు నింపడం లేదు?
- కొత్తకొండ మండలం ఎప్పుడో ప్రజలకు స్పష్టత ఇవ్వండి.
- మాటల్లో అభివృద్ధి.. పనుల్లో మాత్రం అడుగు కదలడం లేదు
- బీజేపీ జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్వీరాజ్‌గౌడ్

**భీమదేవరపల్లి ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ ) :** భీమదేవరపల్లి మండలం లో పల్లె పల్లె కు పొన్నం అన్నా కార్యక్రమం లో 5 గ్రామాలు తిరుగుతూ ప్రజల సమస్యల పై ఎలాంటి స్పష్టత లేదు. గౌరవెల్లి ప్రాజెక్టు, కొత్తకొండ మండలం ఏర్పాటు, కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానం భూముల సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. గాలి మాటలతో ప్రజలను మభ్యపెట్టొద్దని హెచ్చరించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికాకముందే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబు ట్రయల్ రన్ చేసి ప్రజలను నమ్మించే



ప్రయత్నం చేశారని, అయినా ప్రజలు నమ్మకుండా బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తిస్థాయిలో నింపడం లేదో మంత్రి ప్రజలకు స్పష్టం చేయాలని ప్రశ్నించారు. ప్రాజెక్టు కింద రూ.450 కోట్లు వచ్చాయని ఒకసారి, రూ.250 కోట్లు వచ్చాయని మరోసారి చెప్పడం ప్రజలను అయోమయానికి గురిచేస్తోందన్నారు. “రూ.450 కోట్లా.. రూ.250 కోట్లా? లెక్క ఒక్కటే ఉండాలి.. మాటలు మాత్రం మారకూడదు” అని వ్యాఖ్యానించారు. గౌరవెల్లి ప్రాజెక్టును నింపితే భూగర్భజలాలు పెరిగి ఈ ప్రాంత రైతాంగానికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కొత్తకొండ మండలం ఏర్పాటుకు ప్రభుత్వం ఎంత సమయం తీసుకుంటుందో మంత్రి స్పష్టం చేయాలని, వేలేరు మండలం ఏర్పాటు చేసినప్పుడు కొత్తకొండను ఎందుకు పక్కన పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి అధికారంలో ఉండి కూడా కొత్తకొండ మండలం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. “కొత్తకొండ మండలం ఫైలు ఏ టేబుల్‌పై ఉందో అయినా చెప్పండి.. ప్రజలు ఎదురుచూస్తున్నారు” అని అన్నారు. ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానానికి చెందిన భూముల సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారో ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. దేవస్థానం అభివృద్ధి చేస్తామని నాయకులు ప్రకటనలు చేయడం తప్ప గత పదేళ్లలో, ప్రస్తుత ప్రభుత్వ కాలంలోనూ సొంత నిధుల నుంచి ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. “మాటల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది.. పనుల్లో మాత్రం అడుగు కదలడం లేదు” అని ఎద్దేవా చేశారు. గౌరవెల్లి నీరు, కొత్తకొండ మండలం, వీరభద్రస్వామి భూముల సమస్యలపై కాలపరిమితితో కూడిన స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకుంటే గాలి మాటలతో ప్రజలను మబ్బుపెట్టే రోజులు పోయాయని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పృథ్వీరాజ్ గౌడ్ అన్నారు.

## మోత్కుపల్లి గ్రామ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలి

- త్వరలో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల పనులు ప్రారంభం -మంత్రి పొన్నం ప్రభాకర్..
- గ్రామల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే అధికారులపై చర్యలు తప్పవు....
- మోత్కుపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం....

**అక్కన్నపేట,ఆగస్టు 22, ( పీపుల్స్ డైరీ) :** అక్కన్నపేట మండలం మోత్కుపల్లి గ్రామంలో నిర్వహించిన “పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన” కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించి, పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణకు మందులు వేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీ వద్ద ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజల సమక్షంలో గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి గ్రామ సమస్యలు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### మోత్కుపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి

ప్రజా పాలన ప్రభుత్వంలో మోత్కుపల్లి గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా గణనీయమైన ప్రయోజనం కలిగిందని మంత్రి తెలిపారు. గ్రామంలో 144 పెన్షన్లు ఉండగా, ప్రతి నెలా రూ.3.60 లక్షల లబ్ధి. 8 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా పూర్తయ్యాయి. రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి. 14 మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.4.42 లక్షలు విడుదల. 4 SHGలకు బ్యాంకు లింకేజీ కింద రూ.19 లక్షలు విడుదల. 565 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.70.83 లక్షలు విడుదల. ముగ్గురు రైతుల కుటుంబాలకు రైతు బీమా కింద రూ.15 లక్షల ఆర్థిక సాయం. గ్రామంలో 564 రేషన్ కార్డులు, 1,519 యూనిట్లు ఉండగా 27 కొత్త రేషన్ కార్డులు పంపిణీ. 5 కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇద్దరికి రాజు-క్రా ద్వారా రూ.2 లక్షల రుణాలు. MPUPS పాఠశాలకు రూ.5 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం. మోత్కుపల్లి నుంచి అంతకపేట ఎక్స్‌రోడ్డు, పెద్దతండా, అవ్వకుంటతండా వరకు జడ్పీ రోడ్డుకు రూ.30 లక్షలు మంజూరు. రూ.5 లక్షలతో డ్రైనేజీ పనులు పూర్తి. ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలతో డ్రైన్ మంజూరు.

### గ్రామ సమస్యల పరిష్కారానికి మంత్రి ఆదేశాలు

గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, రోడ్లు, మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు, మల్లంపల్లి వెళ్లే బ్రిడ్జి, వీఓ భవనం, గ్రామ పంచాయతీ భవనం, స్మశానవాటిక రోడ్డు, డ్రైనేజీ, కిచెన్ షెడ్, స్కూల్ బిల్డింగ్, కమ్యూనిటీ హాల్ తదితర సమస్యలను సర్పంచ్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు మంత్రి వెంటనే మంజూరు ప్రకటించారు. గ్రామాన్ని దత్తత తీసుకోవాలని గ్రామస్థులు చేసిన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎస్సీ కాలనీలో రోడ్లకు సంబంధించిన సమస్యను ఎలాంటి పక్షపాతం లేకుండా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఎమ్మార్వో, ఎస్సై, గ్రామ సర్పంచ్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో ఎలాంటి లిటిగేషన్ లేకుండా రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

### నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జల సిరి పథకం కింద ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకుని వర్షపు నీటిని సంరక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రతి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, ముఖ్యంగా ఐదు ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులు తమ భూమిలో కొంత భాగంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని సూచించారు.

### గౌరవెల్లి ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభం...

గౌరవెల్లి ప్రాజెక్టుకు సుప్రీంకోర్టులో గ్రీన్‌సిగ్నల్ లభించిందని మంత్రి తెలిపారు. కాలువల పనులకు నిధులు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి కాలువల తవ్వకాలు ప్రారంభిస్తామని చెప్పారు. కాలువల భూసేకరణకు మోత్కుపల్లి ప్రజలు సహకరించినందుకు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కట్కూరు ఎక్స్‌రోడ్డు నుంచి మోత్కుపల్లి వరకు హైరోడ్డు నిర్మాణానికి రూ.21 కోట్లు మంజూరు చేశామని, ఈ మార్గంలో బ్రిడ్జి కూడా మంజూరైందని మంత్రి తెలిపారు.

### ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ ద్వారా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



తీసుకుంటున్నామని, ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. 14--15 సంవత్సరాల బాలికలకు క్యాన్సర్ నివారణకు అవసరమైన టీకాలు వేయించుకోవాలని సూచించారు.

### విద్యుత్, విద్య, పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ

మోత్కుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది అదనంగా 26 మంది విద్యార్థులు, ప్రీ-ప్రైమరీలో 10 మంది విద్యార్థులు చేరడం అభినందనీయమని మంత్రి అన్నారు. పాఠశాలను మరింత బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్‌ను అందించే సూర్యఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అందే సహాయాన్ని ఉపయోగించుకుని ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోవచ్చని, అవసరానికి మించి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే అవకాశం ఉందని తెలిపారు.

### అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు....

ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేసినప్పుడు అధికారులు స్పందించాల్సిందేనని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై అధికారులు స్పందించకపోతే సస్పెన్షన్ తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. గ్రామానికి అందించిన స్టీల్ బ్యాంకును ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ వస్తువులను ఉపయోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో రామ్మూర్తి, ఎమ్మార్వో మధుసూదన్, గ్రామ సర్పంచ్ ఎల్పుకొండ కొమురవ్వ రవీందర్, జిల్లా, మండల స్థాయి అధికారులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
ఆదివారం, 23 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 162



# ఈహెచ్ఎస్ సేవలకు మరింత బలోపేతం..

**బీబీఆర్ ఆసుపత్రిలో డీఎంహెచ్ఓ పరిశీలన**



**మేడ్చల్ ఆగస్టు 22(పీపుల్స్ డైరీ):-** ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈహెచ్ఎస్ సేవలపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ బాలానగర్‌లోని బీబీఆర్ ఆసుపత్రిని సందర్శించి ఈహెచ్ఎస్ సేవల నిర్వహణను పరిశీలించారు.

### నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

ఆసుపత్రిలో ఈహెచ్ఎస్ లబ్ధిదారుల నమోదు ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది? లబ్ధిదారులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా? అనే అంశాలను డీఎంహెచ్ఓ పరిశీలించారు. ఈహెచ్ఎస్ పరిధిలో అందిస్తున్న వైద్య సేవలు, లబ్ధిదారుల నమోదు వివరాలు, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు.

### లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా సేవలు

ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈహెచ్ఎస్ ద్వారా అందే వైద్య సేవలు అత్యంత కీలకమైనవని, సేవలు పొందే సమయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆసుపత్రి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డా. కె. ఆనంద్ సూచించారు. నమోదు ప్రక్రియలో పారదర్శకత పాటించడంతో పాటు, అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులకు అందించే వైద్య సేవల నాణ్యతపై నిరంతరం దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

### బాధ్యతాయుత సేవలే లక్ష్యం

ఈహెచ్ఎస్ కింద వైద్యం పొందే ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన సేవలు అందేలా ఆసుపత్రి యాజమాన్యం, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకం ఉద్దేశ్యం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతుందని ఈ పరిశీలన ద్వారా స్పష్టమవుతోంది. ఈహెచ్ఎస్ సేవల్లో నాణ్యత, నమోదు ప్రక్రియలో పారదర్శకత, లబ్ధిదారులకు సకాలంలో వైద్యం ఇవే ప్రధాన లక్ష్యాలుగా వైద్య ఆరోగ్య శాఖ ముందుకు సాగుతోంది.

# మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం, హాస్టల్ తనిఖీ

- **విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించాలి**
- **మెనూ అమలు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలపై అదనపు కలెక్టర్ పరిశీలన**

**కథలాపూర్ :** విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతతోపాటు వసతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ సూచించారు. కథలాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను శనివారం ఆయన సందర్శించి పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం, హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు.

### మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక పరిశీలన

మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పరిశీలించారు. భోజనం నాణ్యత, వంటశాలలో పరిశుభ్రత, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు తదితర అంశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా సంబంధిత సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మోడల్ స్కూల్ హాస్టల్‌ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.



హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

### విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వారి ఆరోగ్యం, పరిశుభ్రతకు సంబంధించి అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అదనపు కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడంతోపాటు భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ పర్యటనలో ఇన్‌చార్జి ఎంపీడీవో నరేందర్, మండల విద్యాధికారి, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా పోలీసు సంఘం నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

- **పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలి**
- **వైద్య సదుపాయాలు, పిల్లల విద్యా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : సీఐ నిరంజన్ రెడ్డి**

**కరీంనగర్ రూరల్ :** కరీంనగర్ జిల్లాలో పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నూతనంగా ఎన్నికైన జిల్లా పోలీసు సంఘం కార్యవర్గ సభ్యులకు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఘన సన్మానం లభించింది. నూతనంగా ఎన్నికైన జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు ఏ. సతీష్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులు శైలజ, పీసీ, ఎం.డి. అఫ్జల్, పీసీ, ఇతర కార్యవర్గ సభ్యులు శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నిరంజన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

### శాలువాలతో సత్కరించి.. అభినందనలు

ఈ సందర్భంగా సీఐ నిరంజన్ రెడ్డి నూతనంగా ఎన్నికైన జిల్లా పోలీసు సంఘం కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నూతనంగా ఏర్పాటైన పోలీసు సంఘానికి తన పూర్తి సహాయ సహకారాలు, మద్దతు ఎల్లవేళలా ఉంటాయని సీఐ తెలిపారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంఘం చొరవ చూపాలని సూచించారు.



### వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు పోలీసు సంఘం కృషి చేయాలని సీఐ నిరంజన్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా పోలీసు సిబ్బందికి మెరుగైన వైద్య సదు-పాయాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వారి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అవసరమైన అంశాలను ప్రభుత్వానికి నివేదించి, పరిష్కారం లభించేలా కృషి చేయాలని సూచించారు.

### పిల్లల విద్యా సమస్యల పరిష్కారానికి కృషి

పోలీసు సిబ్బంది పిల్లల విద్యకు సంబంధించిన సమస్యలపైనా పోలీసు సంఘం ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ పేర్కొన్నారు. విద్యా అవసరాలతో పాటు పోలీసు కుటుంబాలకు సంబంధించిన ఇతర సంక్షేమ అంశాలను గుర్తించి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి సంబంధించిన అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సంఘంపై ఉందన్నారు.

### నిరంతరం పనిచేయాలని ఆకాంక్ష

నూతనంగా ఎన్నికైన జిల్లా పోలీసు సంఘం కార్యవర్గం పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తుందనే ఆశాభావాన్ని సీఐ నిరంజన్ రెడ్డి వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి అవసరమైన సందర్భాల్లో తన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సిబ్బంది మె-త్తం నూతనంగా ఎన్నికైన జిల్లా పోలీసు సంఘం కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించి అభినందించారు. నూతన కార్యవర్గం పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేయాలని సిఐ నిరంజన్ రెడ్డి ఆకాంక్షించారు.

# శిలాఫలకంపై 'నియోజకవర్గం' గందరగోళం.!

- **ఇద్దరు మంత్రుల సమక్షంలోనే 'మెట్‌పల్లి'గా పొరపాటు**
- **కోరుట్ల ఎమ్మెల్యే పేరుకింద 'మెట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే'గా ముద్రణ**
- **అప్పుడే డిలిమిటేషన్ జరిగిపోయిందా.? పాత నియోజకవర్గం మళ్లీ వచ్చిందా.?**
- **అధికారిక వివరాలు పరిశీలించకుండానే శిలాఫలకం సిద్ధం చేశారా.?**
- **తప్పిదంపై ఉన్నతాధికారులు వివరణ ఇవ్వాలంటున్న స్థానికులు**

**జగిత్యాల :** ప్రభుత్వ కార్యక్రమాలకు ఏర్పాటు చేసే శిలాఫలకం అంటే ఆ రోజు కార్యక్రమానికి గుర్తుగా పెట్టే నాలుగు అక్షరాలు కాదు.. అది ప్రభుత్వ రికార్డుల్లోనూ, ప్రజల జ్ఞాపకాల్లోనూ నిలిచిపోయే అధికారిక గుర్తు. అలాంటి శిలాఫలకంపైనే ప్రస్తుత నియోజకవర్గం పేరు తప్పిపోతే.. దాన్ని సాధారణ ముద్రణ పొరపాటుగా తీసుకోవాలా.? లేక అధికారిక వివరాలను పరిశీలించే యంత్రాంగం పనితీరుపై ప్రశ్నించాలా.? జగిత్యాల జిల్లాలో ఇద్దరు మంత్రుల సమక్షంలో జరిగిన ఓ అధికారిక కార్యక్రమానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ పేరుకింద 'కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే'కు బదులు 'మెట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే' అని ముద్రించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2009 నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మెట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం స్థానంలో కోరుట్ల నియోజకవర్గం ఏర్పడిన విషయం తెలిసిందే. అలాంటప్పుడు ప్రభుత్వ కార్యక్రమం శిలాఫలకంపై మళ్లీ 'మెట్‌పల్లి నియోజకవర్గం' పేరు ప్రత్యక్షమవ్వడం వెనుక కారణమేంటి.? ఏదైనా అధికారిక మార్పు జరిగిందా.? లేక శిలాఫలకం తయారీలోనే తప్పు దొర్లిందా.? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.!

### ఇద్దరు మంత్రుల సమక్షంలోనే తప్పిదం

జగిత్యాల జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ భవనానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన శిలాఫలకంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారుల పేర్లు ముద్రించారు. అయితే కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేరు కింద మాత్రం 'కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే' స్థానంలో 'మెట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే' అని పేర్కొనడం అందరి దృష్టినీ ఆకర్షించింది. సాక్షాత్తూ ఇద్దరు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్న అధికారిక కార్యక్రమంలోనే నియోజకవర్గం పేరులో ఈ పొరపాటు చోటుచేసుకోవడంపై పలువురు నాయకులు, స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### కోరుట్ల స్థానంలో మెట్‌పల్లి ఎలా.?

ప్రస్తుతం కోరుట్ల శాసనసభ నియోజకవర్గంగా ఉన్న ప్రాంతానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమంలో మెట్‌పల్లి నియోజకవర్గం పేరు కనిపించడమే ఈ వ్యవహారంలో ప్రధాన అంశంగా మారింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అప్పటి మెట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం స్థానంలో కోరుట్ల నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి కోరుట్ల నియోజకవర్గం పేరుతోనే ఎన్నికలు, ప్రజాప్రతినిధుల వ్యవహారాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత అధికారిక కార్యక్రమంలో మెట్‌పల్లి నియోజకవర్గం పేరు ఉపయోగించడానికి ఏదైనా కొత్త ఉత్తర్వు వచ్చిందా.? నియోజకవర్గ హద్దుల్లో మార్పు జరిగిందా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ అలాంటి అధికారిక మార్పేమీ లేకపోతే శిలాఫలకంపై ఆ పేరు ఎలా ప్రత్యక్షమైందన్నదే కీలక ప్రశ్నగా మారింది.

# విద్యార్థులకు ఉచిత పాఠశాల యూనిఫామ్స్ పంపిణీ

**మేడ్చల్ 297 డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠశాల యూనిఫామ్స్ పంపిణీ**



ఆర్.ఆర్. ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వయంగా యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందించడం సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కటిక వినయ్, శ్రీనాథ్ ముదిరాజ్ (అవతార్), రఘు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్.ఆర్. ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నాటు బాంబు పేలి మహిళా కు గాయాలు

**అడవి పందుల కోసం అమర్చిన బాంబ్ గా అనుమానం**



**రేగొండ ఆగస్టు 22 పీపుల్స్ డైరీ..** వ్యవసాయ చేనులో గడ్డి ఏరుతుండగా నాటు బాంబు పేలి ఓ మహిళా కూలీ తీవ్రంగా గాయపడిన ఘటన గూడెపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గూడెపల్లి గ్రామానికి చెందిన గుండె స్వర్ణలత (36) శనివారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన మోరె రాజు వ్యవసాయ చేనులో గడ్డి నలుసు ఏరేందుకు కూలి పనికి వెళ్లింది. కొడవలితో గడ్డి ఏరుతున్న క్రమంలో, భూమిలో దాచి ఉంచిన నాటు బాంబు (అడవి పందుల కోసం అమర్చినట్లు అనుమానిస్తున్న బాంబు)కు కొడవలి తగలడంతో అది ఒక్కసారిగా పేలింది. ఈ ప్రమాదంలో స్వర్ణలత ఎడమ చెంప, ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కూలీలు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రేగొండ పోలీసులు సమాచారం అందుకుని దర్యాప్తు చేపట్టారు.

# గోవు పూజ చేద్దాం, గోవును సంరక్షిద్దాం



**గన్నేరువరం:** గోవును పూజ పూజిద్దాం గోవును సంరక్షణ చేద్దాం గోమాతను పూజించడమే కాదు ప్రాణంగా కాపాడుకుందాం అని బిజెపి మండల ఉపాధ్యక్షులు గాలి పెల్లి శంకర్ తెలిపారు గోమాతకు పూలు సమర్పించడం కంటే ఆమె ప్రాణానికి రక్షణగా నిలవడమే నిజమైన గోభక్తి అని తెలిపారు గోపూజ ఒక్క రోజు కావచ్చు గో సంరక్షణ జీవితాంతం సాగాలని అందరం మారుదాం గోమాతను కాపాడుకుందాం గోమాతకు హారతి ఇవ్వడం మాత్రమే కాదు ఆపదలో ఉన్న గోమాతలకు అండగా నిలబడదాం పూజతో భక్తి చూపిద్దాం సంరక్షణతో బాధ్యతను నిరూపిద్దాం గోమాత కోసం మన ఆలోచన మారాలి గోమాతను పూజిద్దాం అనే మాటల ఆపండి గోమాతను కాపాడుదాం అనే సంకల్పంతో ముందుకు సాగుదామని గాలి పెల్లి శంకర్ తెలిపారు

# మంత్రి వ్యాఖ్యలపై బీజేపీ నేతల మండిపాటు

**బీజేపీ--బీఆర్ఎస్ ఒక్కటేననడం సరికాదు- ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆరోపణలు**



**ఎండపల్లి:** బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం ఎండపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు రావు హనుమంతరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొమ్ము రాంబాబు మాట్లాడుతూ.. మంత్రి వ్యాఖ్యలు రాజకీయ అవగాహన లేమికి నిదర్శనమని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ సిద్ధాంతాలు, విధానాలు పూర్తిగా భిన్నమైనవని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష పార్టీలపై ఆరోపణలు చేయడం మంత్రికి తగదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సైతం బీజేపీ నిరంతరం పోరాడిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ మంత్రి కొత్త ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నారని, పార్టీ కార్యకర్తలే తమ బలమని పేర్కొన్నారు. మంత్రి ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం కంటే నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల జనరల్ సెక్రటరీలు మంచికట్ల రవి, మేడిపల్లి రాజశేఖర్, ఉపాధ్యక్షులు గోపనవేని గంగాచలం, మూల ప్రశాంత్, బీజేవైఎం జనరల్ సెక్రటరీలు మేడిపల్లి రాజు, తిరుమల ప్రమోద్, జిల్లా నాయకుడు సట్టా రవిరాజ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దేవి సంతోష్, బూత్ అధ్యక్షుడు కొదురుపాక అశోక్, మండల పార్టీ సెక్రటరీ దాసరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# చిరు సినిమాకు కాకాగా టైటిల్

అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీమ్ అప్‌డేట్ ఇచ్చింది. సినిమా టైటిల్‌ను 'కాకా'గా ఖరారు చేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది. ఇందులో చిరంజీవి మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. అక్వా సంస్థలో ఉద్యోగిగా చిరంజీవి సత్యం అనే పాత్రలో నటిస్తున్నారు. 'ఇది సత్యం మాట.. ఇంకా డౌటా' అనే డైలాగు ఆయన పాత్ర స్వభావాన్ని తెలుపుతోంది. ఇందులో కనిపించిన 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్‌కు.. ఫ్లాష్ బ్యాక్‌లో ఆయనకు తండ్రితో అనుబంధం ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. టైటిల్ రివీల్ అనంతరం యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజు.. మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ చిరును గుర్తుచేస్తోంది. ఇక 'కాకా' సినిమా సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది

# నా నిజమైన హీరో మా అన్నయే

## చిరు బర్త్‌డే సందర్భంగా పవన్ కళ్యాణ్ విషెస్



మెగాస్టార్‌గా చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ ప్రత్యేక రోజున జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన అన్నయ్య చిరంజీవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ హృదయాన్ని హత్తుకునే ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. చిన్ననాటి నుంచి చిరంజీవి తనకు కేవలం అన్నయ్య మాత్రమే కాదని, ఎప్పటికీ తన హీరోనే అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. చిరంజీవి కళాశాల చదువుల కోసం నర్సాపూర్ వెళ్లిన రోజులను గుర్తు చేసుకుంటూ, వేసవి సెలవుల్లో ఆయన ఇంటికి రావడం తమ కుటుంబానికి పండగలా ఉండేదని తెలిపారు. తిరిగి చదువుల కోసం వెళ్లిపోయినప్పుడు ఇంట్లో ఒక వెలితి కనిపించేదని, ఆయన తిరిగి వచ్చే వరకు ఆ ఆనందం ఉండేది కాదని భావోద్వేగంగా రాశారు. తన పాఠశాల రోజుల నుంచే అన్నయ్యపై తనకు ఎంతో గర్వం ఉండేదని పవన్ తెలిపారు. చిరంజీవి ఇంకా హీరో కాకముందే తన దృష్టిలో ఆయన హీరో అని చెప్పారు. పొడవాటి జుట్టు, బెల్‌బాటమ్ ప్యాంట్, కళ్లద్దాలు ధరించి తమ తండ్రి బు÷-లలెట్ బైక్ నడుపుతూ కనిపించే చిరంజీవిని చూసిన క్షణాలు ఇప్పటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. చిరంజీవి తన కెరీర్ తొలినాళ్లలో సింగపూర్ పర్యటనకు వెళ్లి వచ్చిన సందర్భంగా తమ కోసం తెచ్చిన బహుమతులను కూడా పవన్ గుర్తు చేసుకున్నారు. పెద్ద నీలిరంగు బ్యాగ్‌లో తన కోసం తీసుకొచ్చిన చిన్న లెగో హెలికాప్టర్, రిమోట్ కార్లు, రేసింగ్ ట్రాక్, కామిక్స్, మ్యూజిక్ టేపులు, టేప్ రికార్డర్, పెర్ఫ్యూమ్‌లు వంటి బహుమతులు తన చిన్ననాటి జ్ఞాపకాలలో ప్రత్యేకంగా నిలిచిపోయాయని చెప్పారు. చిరంజీవి ఎప్పుడూ తమ ఇంటికి ఆనందాన్ని, చిరునవ్వులను తీసుకొచ్చేవారని తెలిపారు. దక్షిణాది, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య సాంస్కృతిక వారధిగా చిరంజీవి కీలక పాత్ర పోషించారని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. సాంకేతికతపై ఆసక్తి, దాతృత్వం, కుటుంబంపై ప్రేమ, నటుడిగా సాధించిన అపారమైన విజయాలు.. కేంద్ర మంత్రిగా నిర్వహించిన బాధ్యతలు.. జాతీయ పురస్కారాలు, పద్మవిభూషణ్ వంటి అత్యున్నత గౌరవాలు అందుకున్నప్పటికీ ఆయనలో పనిచేయాలనే తపన మాత్రం ఎప్పుడూ తగ్గలేదని పేర్కొన్నారు. ఇటీవల ఆరోగ్యపరమైన చికిత్స తర్వాత కూడా చిరంజీవి ఎంతో వేగంగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లకు వెళ్లడం ఆయనలోని అద్భుతమైన శక్తికి నిదర్శనమని పవన్ అన్నారు. 'నగరం ఎప్పుడూ నిద్రపోనట్లే, ఆయన కూడా ఎప్పుడూ విశ్రమించరు. అందుకే ఆయన మా ప్రియమైన మెగాస్టార్.. నాకు మాత్రం ఎప్పటికీ నా ఏకైక హీరో' అంటూ పవన్ తన అన్నయ్యపై ఉన్న ప్రేమను చాటుకున్నారు.

# వివాహబందంతో ఒక్కటైన అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా



బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ మరోసారి పెళ్లి బంధంలోకి అడుగుపెట్టారు. 'ధురంధర్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విలన్‌గా మరింత గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ రాంపాల్.. తన ప్రియురాలు, మోడల్, నటి గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌ను అధికారికంగా వివాహం చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా సహజీవనం చేస్తున్న ఈ జంట తాజాగా తమ బంధానికి అధికారికంగా మూడుముళ్ల బంధంతో ముగింపు పలికింది. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌లు ఉత్తర గోవాలోని మపుసా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ జంట కార్యాలయానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. పెళ్లి సందర్భంగా ఇద్దరూ ఎలాంటి హంగూ ఆర్భాటాలకు వెళ్లకుండా చాలా సింపుల్‌గా సాధారణ దుస్తుల్లో కనిపించారు. రిజిస్టర్ మ్యారేజ్ సమయంలో కుటుంబ సభ్యులు, కొందరు స్నేహితులు, అత్యంత సన్నిహితులు మాత్రమే వారితో ఉన్నట్లు సమాచారం. గోవాలో అమల్లో ఉన్న యూనిఫామ్ సివిల్ కోడ్ నిబంధనల ప్రకారం వీరి వివాహం నమోదు చేసినట్లు మపుసా సబ్-రిజిస్ట్రార్ సూరజ్ వెర్నేకర్ వెల్లడించారు. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్ 2018 నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. చాలా కాలంగా కలిసి జీవిస్తున్న ఈ జంట తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను మాత్రం పెద్దగా బయటకు వెల్లడించలేదు. అయితే సోషల్ మీడియాలో అప్పుడప్పుడు కలిసి కనిపిస్తూ తమ అభిమానులకు తమ బంధాన్ని పరిచయం చేస్తూ వచ్చారు.

# స్పిరిట్ కోసం భారీగా పారితోషికం డిమాండ్

## నటి దీపికా పడుకొణెపై ప్రణయ్ ఆరోపణలు

ప్రభాస్ హీరోగా సందీప్ వంగా దర్శకత్వంలో రానున్న చిత్రం 'స్పిరిట్' నుంచి దీపికా పదుకొణె వైదొలగడంపై అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. తాజాగా సందీప్ సోదరుడు ప్రణయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆమె ప్రాజెక్ట్‌ను నుంచి వెళ్లిపోవడానికి కారణాన్ని పంచుకోవడంతో ఈ విషయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. దీపిక ఈ సినిమా నుంచి వైదొలగడానికి కారణాన్ని ప్రణయ్ వివరించారు. తన డేట్స్ సర్దుబాటు చేయడంతో పాటు దీపిక భారీ పారితోషికం అడిగారని చెప్పారు. అలాగే సినిమా లాభాల్లో

10 శాతం వాటా అడిగారని తెలిపారు. ఈ కామెంట్స్ ఒక్క రోజుల్లోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారాయి. తాజాగా దీనిపై ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేసి తన స్పందనను పరోక్షంగా తెలిపారు. 'ఒక మహిళ ఇలాంటి డిమాండ్‌లు చేస్తే సహించలేకపోతున్నారు. ఆమె నో చెప్పడం వల్ల ఈగో సమస్యలు వచ్చాయి. ఇది కేవలం పురుషాధిక్య అహంకార సమస్య మాత్రమే అని ఇన్‌స్టాలో ఒకరు పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేయడం ఇప్పుడు వైరల్ అవుతోంది. హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న 'స్పిరిట్' లో మొదట దీపికను ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ ఆమెతో ఏడాదిన్నర వర్క్ చేశారు. అయితే ఆ తర్వాత దీపిక స్థానంలోకి త్రిప్తి దిమ్రిని తీసుకున్నారు. ఆ సమయంలో దీపిక ఈ కథను లీక్ చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి.



# బాలబాలికకు భద్రమైన బాల్యాన్ని అందించడం మనందరి బాధ్యత

- జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు
- విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడం అత్యంత ఆవశ్యకం
- గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ పై పాఠశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను టీచర్లు నిశితంగా గమనించాలి







**ఖమ్మం, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవల పథకం–2024 క్రింద బాలల సంరక్షణ అధికారుల కోసం ఏర్పాటు చేసిన ఒక రోజు ప్రత్యేక అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ... తల్లి కోడి తన రెక్కల కింద పిల్లలను పెట్టుకుని ప్రమాదాల నుండి ఎలా ఆప్యాయంగా కాపాడు కుంటుందో, సమాజంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అదే రీతిలో ప్రేమతో, బాధ్యతతో సంరక్షించాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలపై, తమ ప్రాథమిక హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో చిన్న పిల్లలకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' గురించి సరైన రీతిలో అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలన్నారు. అనవసరపు స్పర్శను గుర్తించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలిపేలా వారిలో ధైర్యాన్ని నింపాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు (భయం, ఒంటరితనం, ఆందోళన) కనిపిస్తే టీచర్లు వెంటనే గమనించాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్గదర్శకులుగా నిలవాలన్నారు.

బాలల సంరక్షణ అధికారులు తమ విధులను కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పిల్లలపై జరుగుతున్న వేధింపులపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలన్నారు. "మొక్కై వంగనిది.. మానై వంగునా.." అనే సామెతను గుర్తు చేస్తూ, బాల్యం నుంచే పిల్లలకు మంచి నడవడిక, బుద్ధులు, నైతిక విలువలు నేర్పించడం చాలా అవసరమని తెలిపారు. బాల్యాన్ని సరైన మార్గంలో తీర్చిదిద్దితేనే వారి భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు బాగుంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ... నేటి డిజిటల్ యుగంలో సమాజం చాలా వేగంగా మారుతోందని, దీనివల్ల బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయని అన్నారు. అధికారులందరూ చట్ట పరిధిని, తాజా నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. చట్టాల అమలు క్షేత్రస్థాయిలో మాత్రమే స్పష్టమైన ఫలితాలను ఇస్తుందని, అందుకే ప్రాథమిక స్థాయిలో పనిచేసే సిబ్బందికి చట్టాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. బాలల సంక్షేమం, హక్కుల కాపాడటంలో ఎలాంటి అలసత్వానికీ తావులేదని స్పష్టం చేశారు. ప్రతి బిడ్డకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం వంటి విధానాలను బాధ్యతాయుతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డా. పి.పి.కృష్ణ అర్జున్, డా.జి.వి. మహేష్ నాథ్, వి. శ్రీనయ్య, ఎం. శ్రీనివాస్, ఎం. కల్పన, వి.శివ రంజని, టి.మురళి మోహన్, పి. దేవి మానస, షేక్ మీరా ఖాసీం సాహెబ్, కె. జ్యోతిర్మయి, బి. రజని, వై. బిందుప్రియ, ఏ. ప్రవీణ్, బి.నాగలక్ష్మి, జి.అఖిల గౌడ్, వి. దీప్తి, జి.నిష్క, బి. నాగ సుమ బాల, వి. లావణ్య, జిల్లా బాల సంరక్షణ అధికారిణి విష్ణు వందన, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

# స్వయం ఉపాధికి 'ఆటో' ఆసరా

- వికలాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి
- ఆటోతో కుటుంబానికి అండగా నిలిచే అవకాశం
- వికలాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ప్రభుత్వం
- ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- వికలాంగుడు విజయ్‌భాస్కర్ కు రూ.2.70 లక్షల విలువైన ఆటో పంపిణీ



**గణపురం, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** వికలాంగుల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గణపురం మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు విజయ్ భాస్కర్‌కు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీ పథకం కింద మంజూరు చేసిన రూ.2.70 లక్షల విలువైన ఆటోను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వికలాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో జీవించేందుకు అవసరమైన ఉపాధి అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ సబ్సిడీతో అందజేసిన ఆటో ద్వారా విజయ్ భాస్కర్ స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలిచే అవకాశం లభించిందన్నారు. వికలాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన వికలాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం విజయ్ భాస్కర్ తనకు ఆటో మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటోతో స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ జీవనోపాధికి తోడ్పడే అవకాశం లభించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, గణపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి భాస్కర్ రావు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని శివ శంకర్ గౌడ్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చూపునిచ్చిన డాక్టర్ గోగుల...

**పేదలకు వరంగా మారిన 'జనతా ట్రస్ట్'!**

**31 కుటుంబాల్లో వెలిగిన కొత్త ఆశలు!**

**విజయవంతంగా ఉచిత కంటి ఆపరేషన్లు**



నల్లబెల్లి ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) : పేదవాడి కంటి వెలుగు కోసం జనతా ట్రస్ట్ చేస్తున్న నిరంతర సేవకు నిదర్శనంగా మరో భారీ సేవా కార్యక్రమం విజయవంతమైంది. నల్లబెల్లి మండల ప్రజల కోసం జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో, శంకర ఐ ఫౌండేషన్ ఇండియా మరియు శ్రీ కాంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ సహకారంతో ఇటీవల భారీ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వందలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వైద్యుల సలహా మేరకు 31 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు.

**ఉచిత రవాణా... కార్పొరేట్ స్థాయిలో ఆపరేషన్లు:**

బాధితులందరినీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యాధునిక పద్ధతిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. చికిత్స అనంతరం సంపూర్ణ ఆరోగ్యంతో, తిరిగి చూపు పొందిన 31 మంది లబ్ధిదారులు ఈరోజు సురక్షితంగా నల్లబెల్లికి చేరుకున్నారు.

**కన్నీటిపర్యంతమైన లబ్ధిదారులు:**

గత కొన్ని సంవత్సరాలుగా దృష్టి లోపంతో బాధపడుతూ, ఆర్థిక స్తోమత లేక ఆపరేషన్ చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న బాధితులు తిరిగి చూపు రావడంతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "జనతా ట్రస్ట్ వల్లే మాకు మళ్ళీ ఈ లోకాన్ని చూసే భాగ్యం కలిగింది. జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి కి మేము జీవితాంతం రుణపడి ఉంటాం" అని కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రజా సేవే మా లక్ష్యం - ప్రజల ఆరోగ్యమే మా బాధ్యత:**

ఈ సందర్భంగా జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ0పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించడమే మా ముఖ్య ఉద్దేశం 31 మంది జీవితాల్లో వెలుగులు నింపడం మాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది. భవిష్యత్తులో కూడా నియోజకవర్గ వ్యాప్తంగా ఇలాంటి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తాం" అని స్పష్టం చేశారు.





# అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

**గీసుకొండ, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** గీసుగోండ మండలం ఉకల్ క్రాస్ లోని ఎస్ఎస్ గార్డెన్ లో గీసుగోండ,సంగెం మండలాలుడ 15,16,17వ డివిజన్ ల పరిధిలోని పేద కుటుంబాల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందించే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హత ఉన్నప్పటికీ అనేక మంది పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.గీసుగోండ మండలానికి 11648, సంగెం మండలానికి 16752,15 డివిజన్ 6202,16వ డివిజన్ కి 2164, 17వ డివిజన్ కి 4339 కి నూతన స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ కార్డు కేవలం ఒక గుర్తింపు కార్డు మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు ఇది కీలక ఆధారమని పేర్కొన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని, అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

# సింగరేణి ఆసుపత్రిలో కలకలం

- గేట్ పాస్ కోసం అంబులెన్స్ ఆలస్యం
- ఏసొంత వాహనంలో గర్భిణీ తరలింపు!

**మణుగూరు ఆగస్ట్ 22(పీపుల్స్ డైరీ) :** మణుగూరు సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఒక సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రసవ వేదనతో బాధపడుతున్న ఒక గర్భిణీని అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్స్ వాహనాన్ని పంపించాల్సిందిగా కుటుంబ సభ్యులు కోరారు. అయితే, ఆసుపత్రి నుండి అంబులెన్స్ బయటకు వెళ్లాలంటే 'గేట్ పాస్' నిబంధనల వల్ల వాహనం బయలుదేరడంలో ఆలస్యం జరిగింది.



దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో వేరే దారి లేక ఆమెను తామే సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది.

ఈ విషయమై వాహన ఇన్చార్జ్‌ను వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నిబంధనలను అమలు చేస్తున్నామని తెలిపారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో ఇలాంటి నిబంధనలను నెపంగా చూపి వాహనాన్ని సిద్ధం చేయబడంలో ఆలస్యం జరగడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రాణం కంటే నిబంధనలు ముఖ్యమైనవి కావు" అని, అత్యవసర సమయాల్లో స్పందించే విధంగా అధికారులు ఈ సమస్యను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యంపై ఉందనడంలో సందేహం లేదు.

# బొజ్జాయిగూడెం ఏహెచ్ఎస్ హాస్టల్‌లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కోరం కనకయ్య.. వసతులపై ఆరా**





**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం), ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని బొజ్జాయి గూడెం ఏహెచ్ఎస్ హాస్టల్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యాబోధన, భోజన నాణ్యత తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. హాస్టల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న ప్రాంతాన్ని, భోజనం వడ్డించే పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే.. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం మెనూ, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో త్వరలోనే డైనింగ్ హాల్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులందరికీ సరిపడా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థులతో ముచ్చటించారు. విద్య ప్రాధాన్యాన్ని వివరించి, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు.

**రాత్రివేళ బయటకు వెళ్లడంపై ఆగ్రహం**

కొద్ది రోజుల క్రితం రాత్రి సమయంలో కొందరు విద్యార్థులు హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన ఘటనపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యాబోధన విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని హెచ్చరించారు. బాధ్యతల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు, సస్పెన్షన్‌కు సైతం వెనుకాడబోమని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే వెంట ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు సొసైటీ చైర్మన్ మెట్ల రామకృష్ణ, బొజ్జాయిగూడెం ఉపసర్పంచ్ అరెం కిరణ్, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మూగల మల్లేష్, గౌతం రాజ్ తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పర్యటన

**బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చిన బీఆర్ఎస్ ఇంచార్జ్**



కేసముద్రం ఆగస్టు 22 (పీపుల్స్ డైరి ) మహబూబాబాద్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ కేసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. బేరువాడ గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండా రామ్మూర్తి గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి రావడంతో ఆయనను, అదే గ్రామంలో ఆటో ప్రమాదానికి గురైన మల్లేష్ ను పరామర్శించారు. అలాగే ఇటీవల మరణించిన బోడ మంగమ్మ మాజీ సర్పంచ్ బోడా సిరి నాయక్ మాతృమూర్తి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియపరిచారు.అనంతరం ధన్నసరి గ్రామంలో మాడాల యాకయ్య కుటుంబ సభ్యులను, గాంధీనగర్ గ్రామంలో ఇటీవల మరణించిన అజ్మీరా దేవుల మాజీ సర్పంచ్ సక్రు సుక్కి తండ్రి కుటుంబాన్ని, తాళ్ల పూసపల్లికి చెందిన కుంట వీరమ్మ, బలవంతుల సుశీల కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ పర్యటనలో వారి వెంట జిల్లా నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి, మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ రావుల వినయ్ రెడ్డి, సర్పంచులు ఈసం విజయలక్ష్మి లక్ష్మీనారాయణ, ఏర్పుల సునీత కుమారస్వామి, శంకర్, కదిరె ఉపేందర్, రమేష్, మాజీ ఎంపిటిసిలు బోడ కవిత రాజేందర్, కొమ్ము రాహుల్, గొర్రె వెంకన్న తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్ హై సెక్యూరిటీ మెమోల పంపిణీ

**- 4,884 వార్షిక, సప్లమెంటరీ మెమోల జారీ**




**మట్టెవాడ, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** ఇంటర్మీడియేట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇంటర్ బోర్డుచే జారీ చేయబడిన "హై సెక్యూరిటీ మెమోల పంపిణీ" శనివారం ప్రారంభించినట్లు వరంగల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 65 కళాశాలలకు చెందిన వార్షిక, సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన మొత్తం 4,884 మందికి ఈ మెమోలు జారీ అయినట్లు తెలిపారు. అందులో వార్షిక పరీక్షల్లో 3,591 మంది, సప్లమెంటరీలో 1,293 మంది ఉత్తీర్ణులయ్యారని వారందరికీ సర్టిఫికెట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈసారి ఇంటర్ బోర్డు 25 రకాల ఫీచర్లతో అంతిమ మెమోలు జారీ చేసిందని అన్నారు. ఈ మెమోలు నీటిలో తడిసినా, చిరుగులు పడకుండా చాలా కాలం భద్రంగా ఉంటాయని అన్నారు. ఈసారి మెమోల్లో రెండు ఫోటోలు, క్యూఆర్ కోడ్, మెమో బార్ కోడ్ తదితర ఫీచర్లను జోడించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే విద్యార్థి పూర్తి వివరాలు సెల్ ఫోన్ లో పొందేలా తయారు చేశారు. ఇంటర్ బోర్డు సర్వర్ కు అనుసంధానమై ఉన్నందున ఆయా వివరాలు వెనువెంటనే వస్తాయి. అందువల్ల వీటిని "హైసెక్యూరిటీ మెమోలు"గా పరిగణిస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీని నిరోధించడానికి వీటిని రూపొందించారు. అన్ని కళాశాలల యాజమాన్యాలు అధీకృత లెటర్లు పంపి ఇంటర్ కార్యాలయంలోనే అన్ని మెమోలను వెరిఫై చేసుకున్నాక తీసుకెళ్లాలని డిఐఈఓ సూచించారు.

# ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

**చెన్నూరు ఆగస్టు 22(పీపుల్స్ డైరీ)** చెన్నూర్ పట్టణంలో పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి,జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జనసేన తెలంగాణ యువజన విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉ మెగా యూత్ ఫోర్స్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సిద్ధూ ఆధ్వర్యంలో, రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కసరాజు పిలుపు మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, గర్భిణీలకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ చిరంజీవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మామిడి సాయి కుమార్, నవీన్ గంధం, ఆడేటి సాయి కుమార్, నేన్నెలా లక్ష్మణ్, సాయి కార్తీక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# వన మహోత్సవంతో కాలనీల్లో పచ్చదనం పెంపు

- నగర మౌలిక వసతుల అభివృద్ధికి సమగ్ర చర్యలు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**మట్టెవాడ, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ):** నగరంలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.

హంటర్ రోడ్‌లోని 49వ డివిజన్ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి గ్రేటర్ కమిషనర్ టి.వెంకన్నతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. గత కొంతకాలంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి డివిజన్‌లో స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.

వరంగల్ నగరానికి ఆధునిక అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు అవసరమైన నీటి పైప్‌లైన్లు, రోడ్లు, సెంట్రల్ లైటింగ్ తదితర మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చేపట్టే శాశ్వత రోడ్ల పనుల విషయంలో సమన్వయంతో వ్యవహరించాలని, ప్రజాధనం వృథా కాకుండా ప్రణాళికా బద్ధంగా పనులు చేపట్టాలని నాయిని సూచించారు. నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ.530 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేలా నీటి సరఫరా మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌లోని పాత నీటి నిల్వ వ్యవస్థలను ఆధునీకరించడంతో పాటు అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం అభినందనీయమన్నారు. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటడం సంతోషకరమన్నారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నగర అభివృద్ధిలో ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు

**మట్టెవాడ, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ):** లార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేదాంత కృష్ణమూర్తి శర్మ– కవిత దంపతుల సహకారంతో అనురాగ్ సొసైటీ చైర్మన్, సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ కరుకాల అనితారెడ్డి ముఖ్య అతిథిగా భీమారం అంగన్వాడీ కేంద్ర పరిధిలోని గర్భిణీ మహిళలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. సామూహిక శ్రీమంతాలు నిర్వహించడం అందులో నేను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలని, బిడ్డ పుట్టేవరకు డాక్టర్లతో పాటు అంగన్వాడీ టీచర్ సలహాలు, సూచనలు పాటించాలని, కడుపుతో ఉన్న సమయంలో ఒత్తిడి లేకుండా మంచి ఆలోచనలతో ఉండాలని డాక్టర్ అనితారెడ్డి అన్నారు. భీమారం బొడ్రాయి ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐదుగురు గర్భిణీ మహిళలకు పూలు, పండ్లు, స్వీట్లతో పాటు వస్త్రాలను పెట్టి సత్కరించి వారిని ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో లార్డు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ నారగాని నరేశ్ గౌడ్, హనుమకొండ ట్రై సిటీ లయన్స్ క్లబ్ కార్యదర్శి మెరుగు రవీందర్ గౌడ్, మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ పి.స్వరూప, సూపర్ వైజర్ ఎస్.కల్పన, అంగన్వాడీ టీచర్ కీరిట తదితరులు పాల్గొన్నారు.

# ఖిల్లా రోప్ వే పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ఖమ్మం ఖిల్లాపై పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాలు, సౌకర్యాలు అభివృద్ధి చేయాలి
- రోప్ వే నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి



**ఖమ్మం, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** ఖిల్లా రోప్ వే నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.

శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఖిల్లా రోప్ వే నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, జరుగుతున్న నిర్మాణ ప్రక్రియ, పనుల పురోగతి తదితర వివరాలను సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖిల్లా పైకి వెళ్లి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... రోప్ వే నిర్మాణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని, పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ముందస్తుగానే పక్కా ప్రణాళికతో సమకూర్చుకోవాలని, మెటీరియల్ కొరత కారణంగా పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రతి దశ పనులను పూర్తి చేసేలా పక్కా కార్యాచరణ రూపొందించుకోవాలని అన్నారు. రోప్ వే నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఖిల్లా ప్రాంతంలో షీట్ రాక్ ఉన్నందున జియాలజిస్ట్‌తో సమన్వయం చేసుకుని భౌగోళిక పరిస్థితులను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. నిర్మాణానికి సంబంధించిన అవసరమైన అన్ని సాంకేతిక పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. రోప్ వే నిర్మాణం అత్యంత పటిష్టంగా, సురక్షితంగా ఉండేలా అన్ని సాంకేతిక ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ అన్నారు. పనుల నాణ్యత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి నిర్మాణ దశలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



**ఖమ్మం ఖిల్లాపై పర్యాటక ఆకర్షణలు అభివృద్ధి చేయాలి:**

ఖమ్మం ఖిల్లాకు మరింత మంది పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక ఆకర్షణ కార్యక్రమాలు, సౌకర్యాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఖిల్లాపై స్టార్ గేజింగ్ కోసం టెలిస్కోప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, దీనివల్ల సందర్శకులకు ప్రత్యేక అనుభూతి కల్పించడంతో పాటు పర్యాటక ఆకర్షణ మరింత పెరుగుతుందని అన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం ఖిల్లాపై ఒక క్యాంటీన్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా పర్యాటకులకు అవసరమైన ఆహార, త్రాగునీటి సౌకర్యాలు అందడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని అన్నారు. పర్యాటకుల వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఖిల్లాకు వచ్చే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా పార్కింగ్ ప్రాంతాన్ని ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా టూరిజం శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలపై మైనింగ్ సిబ్బంది సర్జికల్ స్ట్రైక్..

- జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్!
- మంత్రి వివేక్ తీవ్ర ఆగ్రహం
- కఠిన చర్యలకు మైనింగ్ అధికారులకు ఆదేశాలు!



**చెన్నూరు ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** అధికారుల కళ్లుగప్పి అక్రమంగా ఇసుక తరలిస్తున్న దందాలపై మైనింగ్ అధికారులు విరుచుకుపడ్డారు. శనివారం రోజున చెన్నూరు మండలంలోని కత్తరశాల వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్న ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను మైనింగ్ సిబ్బంది దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. సీజ్ చేసిన వాహనాలను స్థానిక చెన్నూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.వాహనాలను స్వాధీనం చేసుకునే క్రమంలో అధికారులకు, స్థానిక నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అయినప్పటికీ, పోలీసుల సహకారంతో మైనింగ్ అధికారులు వాహనాలను స్టేషన్‌కు తరలించారు.నిబంధనలు ఉల్లంఘించి అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలు జరిపితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

అక్రమ దందాలపై మంత్రి వివేక్ తీవ్ర ఆగ్రహం:కత్తరశాల ఇసుక అక్రమ తవ్వకాల ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అక్రమ దందాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు.

# రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి

**ఆగస్టు 29న ఇందిరాపార్క్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలి**

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ)**

రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని, వారిపై మోపిన అక్రమ కేసులను ఎత్తివేయాలని రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక భాగస్వామ్య సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ఇల్లందులోని అంబేద్కర్, కొమరం భీమ్ విగ్రహాల వద్ద గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు.

తుడుందెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత తుపాకుల నాగేశ్వరరావు, సీపీఎం నేత అబ్దుల్ నబీ, సీపీఐ మండల అధ్యక్షుడు బొప్పిశెట్టి సత్యనారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు బి. రాంసింగ్, పౌర హక్కుల సంఘం నాయకుడు ఉమామహేశ్వరరావు, తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రామటెంకి అశోక్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంపిడి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు దుర్గారపు వీరభద్రం తదితరులు పాల్గొని మాట్లాడారు.

జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలందరినీ, ముఖ్యంగా ఆదివాసీ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ముస్లిం మైనారిటీ రాజకీయ ఖైదీలపై మోపిన అక్రమ యూఏపీఏ తదితర కేసులను ఎత్తివేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసులను సైతం వెంటనే ఉపసంహరించుకోవాలని, యూఏపీఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



# సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ రూప రెడ్డికి శ్రద్ధాంజలి

**రూప రెడ్డి మృతి విద్యారంగానికి తీరని లోటు**



**కేసముద్రం ఆగస్టు 22 (పీపుల్స్ డైరి )** నల్గొండ జిల్లాలో జరిగిన విషాదకర ఘటనలో మృతి చెందిన ప్రిన్సిపల్ రూప రెడ్డికి శనివారం కేసముద్రం మండలం ధనసరి పరిధిలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ అల్లం శ్రావణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కరస్పాండెంట్ మరియు అసిస్టెంట్ ప్రిన్సిపల్ ఫాదర్ అఖిల్ రూప రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే మార్గదర్శకులని పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యలు, అపార్థాలు లేదా ఆవేశాలకు లోనై తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. విద్యార్థులు కోపం మరియు ఆవేశాన్ని అదుపులో ఉంచుకొని పెద్దల సూచనలు మరియు ఉపాధ్యాయుల సలహాలను గౌరవించాలని సూచించారు.

పాఠశాలలు కేవలం విద్యను అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే ఆలయాలని అన్నారు. సమాజంలో శాంతి, సహనం మరియు పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. రూప రెడ్డి మృతి విద్యారంగానికి తీరని లోటు అని పేర్కొంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నామాల మహేష్, లాల్ బహదూర్, శౌరెడ్డి, రమేష్, వేణుగోపాల్, హరిబాబు, ఐలయ్య, చైతన్య, రోజా, లిల్లీ, అమల, శ్వేత, రాధిక, సంగీత, నిరీక్షణ, యామిని, అరుణ్, దేవు, నరేష్, చక్రు, వెంకటేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పడిగాపురంలో ఉచిత వైద్య శిబిరం - 48 మందికి పరీక్షలు

**కరకగూడెం, ఆగష్టు 22(పీపుల్స్ డైరీ):** కరకగూడెం మండలంలోని పడిగాపురం గ్రామంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు రవితేజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 48 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, జ్వరం తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ – సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వేడి నీరు తాగాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో HEO పోలేబోయిన



కృష్ణయ్య, నా(వీ)నరసింహ రావు, జ్యోతి, యశోద,రేణుక ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నిర్దేశిత గడువులోగా పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలి





- నాణ్యతలో రాజీ వద్దు.. వేగం పెంచండి
- షియర్ వాల్ టెక్నాలజీతో పటిష్ట నిర్మాణం
- 2,640 మంది విద్యార్థులకు వసతి
- పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- మైలారంలో పాఠశాల పనులను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ

**గణపురం, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల సముదాయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం గణపురం మండలంలోని మైలారం గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంగణంలో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల సముదాయంలో నిర్మించనున్న నాలుగు అకాడమిక్ బ్లాకులు, సీనియర్, జూనియర్ డార్మిటరీలు, కిచెన్, డైనింగ్ హాళ్లు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌ల నిర్మాణ ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఫుటింగ్ లెవెల్, బేస్ కాంక్రీట్ పనులను పరిశీలించి, పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని స్పష్టం చేశారు. కాంక్రీట్ గోడల నిర్మాణంలో షియర్ వాల్ టెక్నాలజీని వినియోగించి పటిష్టంగా, నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ ప్రాంగణంలో ఉన్న చెట్లను తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనివార్య పరిస్థితుల్లో చెట్లను తొలగించాల్సి వస్తే అటవీ శాఖ అనుమతులు తప్పనిసరిగా పొందిన అనంతరమే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పాఠశాలలో 2,640 మంది విద్యార్థులతో పాటు 300 మంది సిబ్బందికి వసతి కల్పించాల్సి ఉన్నందున అందుకు అనుగుణంగా మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, సిబ్బందికి నిరంతర నీటి సరఫరా అందేలా 6 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన అండర్‌గ్రౌండ్ ట్యాంక్, 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణంతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా పాఠశాల సముదాయాన్ని నిర్మించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిజిఈడబ్ల్యూఐడిసి ఈఈ అరుణ్ కుమార్, తహశీల్దార్ రాజేశ్వర రావు, ఏఈ జీవన్, సర్పంచ్ సమ్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

■ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**గణపురం, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం గణపురం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రెవెన్యూ అంశాల పురోగతిని పరిశీలించి, పెండింగ్ దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాదాబైనామా దరఖాస్తులు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, భూభారతి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిర్దేశిత గడువులోగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల సంఖ్యను తగ్గించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తహశీల్దార్, సిబ్బందికి సూచించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ పాలన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ పండగను ఘనంగా నిర్వహించిన శ్రీ వివేకవర్ధిని హైస్కూల్



**కేసముద్రం ఆగస్టు 22 (పీపుల్స్ డైరి )** గిరిజనుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండగను కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు సాంప్రదాయ గిరిజన వేషధారణలో పాఠశాలకు రావడం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్రయాకాంతం గౌడ్ మాట్లాడుతూ, తీజ్ పండగ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి పట్ల ఉన్న వారి అనుబంధానికి ప్రతీక అని తెలిపారు. ముఖ్యంగా బంజారా గిరిజన మహిళలు మరియు యువతులు ఈ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొనాలని కోరుకుంటూ తీజ్ పండగను జరుపుకుంటారని వివరించారు.

గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, కళారూపాలు భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ఇటువంటి పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో తమ సంస్కృతి పట్ల గౌరవం, సంప్రదాయాల పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో కూడా తమ మూలాలను మరవకుండా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిర్ర నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇల్లందులో ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నిరసన నిరాహార దీక్ష



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈడీల కమిటీ అంగీకరించిన అంశాలను అమలు చేయాలని, పని భారం తగ్గించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 25న ఒక్కరోజు నిరసన నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు ఇల్లందు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ తెలిపింది.

ఈ సందర్భంగా శనివారం ఇల్లందు ఆర్టీసీ డిపోలో నిరసన నిరాహార దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ నెల 25న నిర్వహించే ఒక్కరోజు నిరసన నిరాహార దీక్షలో ఇల్లందు డిపో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. దీక్షలో పాల్గొనే సభ్యులు ముందుగా తమ పేర్లను కమిటీకి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్ల మేర డొంక రహదారిలో నడుచుకుంటూ వెళ్లి నీటి కుంట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నీటి కుంటల నిర్మాణం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, ఆ నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుందని అన్నారు. నీటి నిల్వలు పెరగడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీటి కుంట నిర్మాణం, పనుల పురోగతి, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి, గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సురవరం ఆశయ సాధనకై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి!

## సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి




**మట్టెవాడ, ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ):** కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి కలలు కన్న సమసమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి అన్ని వర్గాల ప్రజలను కోరారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్లో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశనుండే పోరాటాలను ప్రారంభించి అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే దోపిడీ పీడన లేని సమాజం రావాలని అది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోనే సాధ్యమని విశ్వసించి ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలను నిర్వహించి, మనిషిని మనిషి దోపిడీ చేయలేని కులరహిత మత రహిత వర్గ రహిత సమాజం కోసం సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం జీవితాంతం అనేక ఉద్యమాలను నిర్మించి స్వయంగా పాల్గొని తన ఆస్తులను సైతం పార్టీ కోసం ఖర్చు చేసిన త్యాగధనుడని కొనియాడారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్ లు మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటాలను తీవ్రం చేసి సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయడమే సురవరంకు మనమిచ్చే నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, గుండె బద్రి, సంగి ఏలేందర్, నాయకులు పరికిరాల రమేష్, రాజేందర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, మనోహర్, సాల్మన్, తోట రాజు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందుకు రైలు పునరుద్ధరించాలి

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) ఆగస్టు 22 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందుకి రైలు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కంచర్ల శ్రీనివాస్ చేపట్టిన దీక్షకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు చంద్ర అరుణ శుక్రవారం సంఘీభావం తెలిపారు. పాత బస్టాండ్ సెంటర్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి వారు మాట్లాడారు. జిక్కి రామ్మూర్తి గౌడ్ కూడా దీక్షలో పాల్గొంటున్నారు.

ఈ సందర్భంగా గుమ్మడి నరసయ్య, చంద్ర అరుణ మాట్లాడుతూ 130 సంవత్సరాల చరిత్ర కలిగిన ఇల్లందు బొగ్గు గనులకు పుట్టినిల్లుగా ఉన్నప్పటికీ పట్టణానికి రైలు సౌకర్యాన్ని పునరుద్ధరించకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం వందేభారత్, బుల్లెట్ రైళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ ఆదివాసీ నియోజకవర్గమైన ఇల్లందుకు కనీసం రెండు బోగీల ప్యాసింజర్ రైలును కూడా నడపకపోవడం అన్యాయమని అన్నారు.

రైలు ప్రయాణం కోసం ఇల్లందు ప్రజలు మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గాంధీపురం నుంచి ఇల్లందు వరకు సుమారు 5--6 కిలోమీటర్ల రైల్వే ట్రాక్ నిర్మించి అనుసంధానం చేస్తే కారేపల్లి నుంచి ఇల్లందు మీదుగా గాంధీపురం, కొత్తగూడెం, మణుగూరు వైపు వెళ్లే రైళ్లతో పాటు సింగరేణి--కాకతీయ సూపర్‌ఫాస్ట్ రైళ్లను కూడా ఇల్లందు మీదుగా నడిపే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనివల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.

తెలంగాణలోని ఎంపీలు, మంత్రులతో పాటు జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు సమన్వయంతో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ఇల్లందుకు రైలు సౌకర్యాన్ని పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర పునర్విభజనలో ఇల్లందు నియోజకవర్గాన్ని మూడు జిల్లాలకు విభజించి ప్రజలకు ఇబ్బందులు కలిగించారని విమర్శించారు. చిన్నచిన్న ప్రాంతాలను డివిజన్లుగా ఏర్పాటు చేసినప్పటికీ చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఇల్లందును డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. దీంతో నియోజకవర్గ ప్రజలు కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాల్సిన సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లందుకు రానివ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇల్లందు నియోజకవర్గ ప్రజల అవసరాలను ప్రభుత్వం గుర్తించి రైలు పునరుద్ధరణ, డివిజన్ ఏర్పాటు, సీతారామ ప్రాజెక్టు నీటి సరఫరా వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి, ఇల్లందు ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, వేముల గురునాథం, పెల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com